PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 72 | విజయవాడ, ఆదివారం 12 అక్టోబర్ 2025 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 12 October 2025 | Rs

విద్యుత్ సుంకం 6 పైసలకు తగ్గించాలి

- ప్రభుత్వం కోర్టులో పిటిషన్ ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

2



శుభ్‌మన్ శతకం

- ఇండియా 518/5డిక్లేర్డ్
- వెస్టిండీస్‌తో రెండో టెస్టు

6



కడప జిల్లా పెద్దముడియంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లు

కార్పొరేట్లకు పేదల భూములు

నష్టపరిహారం, ఉద్యోగాలు ఇవ్వకుండా హస్తగతం

కడపలో సోలార్, విండ్, బయోమాస్ పేరుతో 25 వేల ఎకరాలు సేకరణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాపై సోలార్, హైడ్రోపంప్డ్ స్టోరేజీ, విండ్, బయోమాస్, బ్యాటరీ కంపెనీలకు చెందిన కార్పొరేట్ల కన్ను పడింది. 2014లో 70 వేల ఎకరాల భూ బ్యాంకును కేటాయించింది. ఇందులో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6,826 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి 22,119 ఎకరాలు, ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు 3,344 ఎకరాలు కలిపి 25,463 ఎకరాలను దారాదత్తం చేసింది. తాజాగా కడప జిల్లా జమ్మలమడుగు ప్రాంతంలో బ్యాటరీ తయారీ యూనిట్, కమలాపురం నియోజకవర్గ పరిధిలోని చెన్నూరులో బయోమాస్ ప్లాంట్ సహా మరో ఆరు పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సోలార్, విండ్, హైడ్రోపంప్డ్ స్టోరేజీ, బయోమాస్ తదితర పారిశ్రామిక కంపెనీల ఏర్పాటు కోసం రైతుల నుంచి భూములు లాక్కునేందుకు కార్పొరేట్లు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

కడప జిల్లాలో మైలవరం, కొండాపురం, పెద్దముడియం, అన్నమయ్య జిల్లాలో గాలివీడు మండల పరిధిలో సోలార్ కోసం 15,000 ఎకరాలను సేకరించారు. మొదటి ఏడాది ఎకరాకు రూ.31,000 వేలు చొప్పున, ఆ తర్వాత సంవత్సరానికి ఐదు శాతం చొప్పున పెంపు చేస్తామని చెప్పి రైతుల నుంచి భూములు సేకరించారు. పరిశ్రమను ఏర్పాటు చేసిన నేటికీ మిగతా 5లో

	విద్యుదుత్పత్తి (మెగావాట్లు)	సేకరించిన భూములు (ఎకరాలు)
ఎపిఎస్‌పిసిఎల్	1,000	5,728
ఇండోసోల్ సోలార్	3,500	4,715
జెఎస్‌డబ్ల్యూ	400	2,350
సోలార్ ఇన్‌ఫ్రా	400	2,000
ఎకోరెన్ ఎనర్జీ	50	302
సేల్ సోలార్	300	220
సేల్ సోలార్	300	223.42
ఆంప్లస్	205	933
విండ్ (26)	454	688
బయోమాస్ (6)	06	1142
హైడ్రోపంప్డ్ (5)	.....	3,517
పిఎం కుసుమ్	428	301
జెఎస్‌డబ్ల్యూ	ఉక్కు పరిశ్రమ	3,344

రేపు చలో విజయవాడ

- విద్యుత్ ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం సోమవారం నాడు చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు విద్యుత్ ఉద్యోగుల జెఎసి వెల్లడించింది. విజయవాడలోని 1104 యూనియన్ కార్యాలయంలో జెఎసి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ వి కృష్ణయ్య, కన్వీనర్ ఎంవి రాఘవ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఎలను విడుదల చేయాలని, 1999 నుంచి 2004 ఆగస్టు మధ్య నియామకమైన ఉద్యోగులకు జిపిఎఫ్, పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు నగదు రహిత మెడికల్ కార్డు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు, లేబర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఒప్పందం ప్రకారం యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఎరియర్స్ విడుదల చేయాలని, పదేళ్ల సర్వీస్ దాటిన వారందరికీ 2018 రివిజన్‌లో మంజూరు చేసిన సర్వీస్ ఇన్సెంటివ్ పునరుద్ధరించాలని కోరారు. జెఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఎపిఎస్‌సిబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలన్నారు. కారుణ్య నియామకాలను పాత పద్ధతిలోనే జరపాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతి ప్రకారమే నాలుగు డిఎలు, డిఆర్‌లను మంజూరు చేయాలని, ఆటోమెటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం ప్రకారం స్కేల్స్ రూపొందించాలని, మాస్టర్ స్కేల్ గరిష్ట పరిమితితో నిమిత్తం లేకుండా వార్షిక, ప్రమోషన్ ఇంక్రిమెంట్లు మంజూరు తదితర అంశాలను ప్రస్తావించారు. ఈ సమావేశంలో జెఎసి కో-ఛైర్మన్ శేషారెడ్డి, వైస్ ఛైర్మన్ కె శ్రీనివాస్, 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం గోపాలరావు, వైస్ ఛైర్మన్ బి రామలింగా రెడ్డి, కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బాలకాశీ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్‌లో మరో ఘోరం



ఒరిస్సాకు చెందిన వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

దుర్గాపూర్‌లో సిపిఎం ఆందోళన

కోల్‌కతా : రాత్రి వేళ విధుల్లో వున్న మహిళా ట్రెయినీ డాక్టరుపై ఆర్‌జి కర్ ఆస్పత్రిలో అత్యాచారం, హత్య జరిగిన ఘటన మరిచిపోకముందే పశ్చిమ బెంగాల్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. దుర్గాపూర్‌లోని ఐక్యూ మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న ఒరిస్సాలోని జలేశ్వర్‌కు చెందిన వైద్య విద్యార్థినిపై అదే కళాశాల క్యాంపస్ వెలుపల గుర్తు తెలియని వ్యక్తులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. తన స్నేహితుడితో కలిసి డిన్నర్‌కు బయటకు వెళ్లగా శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఈ దుర్ఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. బాధితురాలి స్నేహితుడితో సహ పలువురిని ప్రశ్నించామని చెప్పారు.

ప్రాథమిక దర్యాప్తులో అందిన సమాచారం మేరకు రాత్రి 8-8.30 గంటల సమయంలో విద్యార్థిని తన ఫ్రెండ్‌తో కలిసి బయటకు వెళ్లిందని పోలీసు అధికారి వెల్లడించారు. "దుర్గాపూర్‌లోని శివపూర్ ఏరియాలో గల ఐక్యూ మెడికల్ కాలేజీ గేటుకు సమీపంలో రాత్రి 8.30 గంటల సమయంలో కొంతమంది వ్యక్తులు వారిని అడ్డగించారు. వెంటనే ఆ ఫ్రెండ్ ఆమెను ఒక్కదాన్ని వదిలేసి వెళ్లిపోయాడు. ఆ వచ్చినవారు ఆమె ఫోన్‌ను లాక్కుని, కేంపస్ వెలుపల దట్టంగా చెట్లు వున్న ప్రాంతంలోకి ఆమెను లాక్కుని వెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ సంఘటన గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పర్యవసానాలు వుంటాయని వారు హెచ్చరించారు." అని పోలీసు అధికారి వెల్లడించారు. మెడికో ఫోన్ తిరిగి ఇవ్వాలంటే డబ్బులు ఇవ్వాలని కూడా డిమాండ్ చేశారని, 5వేలు తీసుకున్నారని తెలిపారు. ఆ తరువాత బాధితురాలిని ఫ్రెండ్ కాలేజీకి తీసుకెళ్లాడు. ఆ తరువాత ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు విద్యార్థిని స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసినట్లు పోలీసులు చెప్పారు. 'గత రాత్రే బాధితురాలి ఫ్రెండ్‌తో కూడా మాట్లాడాం. సిసి టివి ఫుటేజీ సేకరించడానికి ప్రయత్నిస్తున్నాం. ఫోరెన్సిక్ బృందం సంఘటనా స్థలానికి వెళ్ళి సాక్ష్యాధారాలను సేకరించింది." అని చెప్పారు. దుర్గాపూర్‌లోని న్యూటౌన్ షిప్ పోలీసులకు బాధితురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

స్నేహితుడిపై బాధితురాలి కుటుంబ సభ్యుల అనుమానాలు

తమ కుమార్తె స్నేహితుల నుండి ఫోన్ రావడంతో శనివారం ఉదయమే తాము దుర్గాపూర్ వెళ్లామని, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆమె తల్లిదండ్రులు విలేకర్లకు తెలిపారు. విద్యాపరంగా కాలేజీకి మంచి పేరు వుందని, అందుకే మెడిసిన్ చదవడం కోసం తమ కుమార్తెను ఇక్కడకు పంపామని ఆమె తండ్రి చెప్పారు. డిన్నర్ కోసం తన కుమార్తెతో కలిసి వెళ్లిన యువకుడు మిగతా 5లో



సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన దుర్గాపూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు

రిలయన్స్ పవర్ సిఎఫ్‌ఒ అరెస్ట్



ముంబయి : రిలయన్స్ గ్రూప్‌లోని రిలయన్స్ పవర్‌కు చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (సిఎఫ్‌ఒ)గా ఉన్న అశోక్ కుమార్ పాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు అరెస్ట్ చేశారు. రూ.68.2 కోట్ల విలువైన నకిలీ బ్యాంక్ గ్యారెంటీకి సంబంధించి ఆయన ప్రమేయం ఉండటంతో ఇడి తన కస్టడిలోకి తీసుకుంది. అనిల్ అంబానీకి అత్యంత సన్నిహితుడిగా ఉన్న అశోక్ కుమార్‌ను శుక్రవారం ఇడి ఢిల్లీ కార్యాలయంలో ప్రశ్నించిన తర్వాత ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. రూ.17వేల కోట్ల బ్యాంకు మోసం కేసులో రిలయన్స్ పవర్ సహా అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలపై ఇడి దర్యాప్తు చేస్తోంది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్‌ఎ) కింద అదుపులోకి తీసుకోగా.. శనివారం ఉదయం ఢిల్లీ కోర్టులో హాజరు పర్చినట్లు తెలుస్తోంది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి)కి సమర్పించిన రూ.68 కోట్లకు పైగా విలువైన నకిలీ బ్యాంక్ గ్యారంటీని రూపొందించడంలో అశోక్ కుమార్ కీలక పాత్ర పోషించారనేది ప్రధాన అరోపణ.

చైనాపై అమెరికా మళ్లీ సుంకాల బాంబు

- అదనంగా 100 శాంతం టారిఫ్‌లు
- కుప్పకూలిన అమెరికా మార్కెట్లు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు చైనాపై సుంకాల బాంబును పేల్చారు. ఇప్పటికే అమల్లో ఉన్న 30 శాతం సుంకాలకు మరో 100 శాతం టారిఫ్‌లను అదనంగా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. కొత్త టారిఫ్‌లు నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించారు. వాణిజ్యంలో చైనా అసాధారంగా దూకుడుగా వ్యవహరిస్తోందంటూ పేర్కొన్నారు. చైనా తయారీ వస్తువులు ఏ దేశం నుంచి దిగుమతి అయినా.. చైనా నుంచి ఏ ఉత్పత్తులు అమెరికాకు ఎగుమతి చేసినా వాటికి ఈ సుంకాలు చెల్లించాల్సి ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి మినహాయింపు ఉండదన్నారు. మరోవైపు నవంబరు 1 నుంచి లేదా ముందుగానే ఈ టారిఫ్‌లు అమల్లోకి రావచ్చని ట్రంప్ అన్నారు. చైనా తీసుకునే తదుపరి చర్యలను బట్టి దీనిపై తమ నిర్ణయం ఉంటుందన్నారు. అమెరికా అరుదైన మినరల్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూనే.. భవిష్యత్తులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరగబోయే భేటీని రద్దు చేసుకుంటానంటూ ట్రంప్ బెదిరింపులకు దిగారు. ఇది జరిగిన కాసేపటికే ట్రంప్ సుంకాల ప్రకటన చేయడం విశేషం.

ట్రంప్ చర్యలతో రెండు దేశాల మధ్య మళ్లీ వాణిజ్య యుద్ధం నడుస్తుందనే భయాలు నెలకొన్నాయి. ఈ పరిణామంతో యుఎస్ మార్కెట్లు కుప్పకూలాయి. శుక్రవారం సెషన్‌లో అక్కడి మార్కెట్లు భారీ నష్టాలను ఎదుర్కోవడంతో.. ఇన్వెస్టర్లు 1.5 లక్షల కోట్ల డాలర్ల మేర సంపదను కోల్పోయారు. నాస్‌డాక్ 3.56 శాతం, డోజోన్స్ 1.90శాతం, ఎస్‌అండ్‌పి 500 సూచీ 2.71శాతం మేర పతనమయ్యాయి. గతంలో ఎప్పుడూ ఈ స్థాయిలో మార్కెట్లు ఇంత నష్టాన్ని చవి చూడలేదు.

సమస్యలు పరిష్కరించకుంటే 'సమ్మె'

- రేపటి నుంచి నల్ల బ్యాడ్జీలతో నిరసన
- పిహెచ్‌సి వైద్యుల రౌండ్‌టేబుల్ తీర్మానం
- పలు యూనియన్ల మద్దతు

3

ఇక ప్రైవేటు డిస్కమ్‌లు!

- ఆగని విద్యుత్‌రంగ వినాశకర సంస్కరణలు
- ప్రజా వ్యతిరేకతను భేఖాతరు చేస్తున్న కేంద్రం
- ఇప్పటికే ఉన్న నెట్‌వర్క్ కార్పొరేట్లకు అప్పగింత
- రాష్ట్రాలకు చేరిన ముసాయిదా బిల్లు

2



కాల్పుల విరమణ నేపథ్యంలో ఉత్తర గాజా వైపు సముద్ర తీరం వెంబడి కాలినడకన వెళ్తున్న పాలస్తీనియన్లు

గాజాలో కాల్పుల విరమణ సుస్థిరంగా కొనసాగాలి

- తొలి దశ అమలును స్వాగతించిన సిపిఎం

న్యూఢిల్లీ : గాజాలో కాల్పుల విరమణకు ఉద్దేశించిన, ఇజ్రాయిల్, హమాస్ మధ్య ఖైదీలు, బందీల మార్పిడికి వెసులుబాటు కల్పిస్తున్న, శాంతి ఒప్పందం తొలి దశ అమలును సిపిఎం పొలిట్‌బ్యూరో స్వాగతించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘించడాన్ని మనం చూశాం. అటువంటి ఉల్లంఘనలు పునరావృతం కావడాన్ని అనుమతించరాదు. ఈ ఒప్పందాన్ని కుదిర్చేందుకు ప్రయత్నించానని చెప్పుకుంటున్న అమెరికా, కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ కట్టుబడి వుండేలా చూసే బాధ్యతను తీసుకోవాలని' పొలిట్‌బ్యూరో పేర్కొంది. మరోసారి దూకుడుకు, దురాక్రమణకు పాల్పడకుండా నివారించేలా అంతర్జాతీయ సమాజం ఇజ్రాయిల్‌పై ఒత్తిడి కొనసాగిస్తుండాలి. పాలస్తీనాపై ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాలన్నింటికీ అనుగుణంగా ఇజ్రాయిల్ తప్పనిసరిగా వ్యవహరించాలి. పాలస్తీనా భూభాగాల ఆక్రమణకు ఇక స్వస్తి చెప్పాలని ఆ ప్రకటన కోరింది.

1967కి ముందునాటి సరిహద్దుల ప్రాతిపదికన తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటు ద్వారా మాత్రమే ఈ ప్రాంతంలో న్యాయమైన, శాశ్వతమైన శాంతి నెలకొంటుందని సిపిఎం విశ్వసిస్తోందని పొలిట్‌బ్యూరో ప్రకటన స్పష్టం చేసింది.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పప్పుధాన్యాల సాగుకు ప్రోత్సాహకాలు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పప్పు ధాన్యాల సాగుకు తగిన ప్రోత్సహకాలు అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు చెప్పారు. పిఎం ధన్ - ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మనిర్భరత మిషన్ కార్యక్రమాన్ని ప్రధాని మోడీ ఢిల్లీ నుండి శనివారం ప్రారంభించగా గుంటూరు లాంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అచ్చెన్నాయడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పిఎం ధన్ ధాన్య యోజన రైతుల ఆర్థిక శక్తివంతానికి దారితీస్తుందని, పప్పుధాన్య ఆత్మనిర్భరత మిషన్ ప్రొటీన్ భద్రతలో స్వయం సమృద్ధి దిశగా పెద్ద అడుగు అని అభిప్రాయపడ్డారు. ఈ పథకం తొలివిడతగా అల్లూరి సీతారామరాజు, అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాలో రానున్న ఆరేళ్ల వివిధ రకాల ఉత్పత్తులకు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉత్పత్తుల పెంపు, నాణ్యతపై దృష్టి, పంట అనంతరం నష్టాలు తగ్గించడం ప్రధాన లక్ష్యంగా వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తారన్నారు. పప్పు ధాన్యాల ఉత్పత్తి-ఉత్పాదకత పెంచటంపై ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం ఆహార అలవాట్లు మారిన నేపథ్యంలో ప్రొటీన్‌తో కూడిన పప్పు ధాన్యాలను ప్రజలకు అందచేయటానికి సాగును ప్రోత్సహించనున్నామని తెలిపారు. రైతులు సాగుచేసిన పప్పు ధాన్యాలను చివరి గింజ వరకు మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులకు అధిక దిగుబడి విత్తనాలు, ఆధునిక సాంకేతిక సాయం, మార్కెట్ అనుసంధానం లభించనుందని చెప్పారు.

అమెరికాలో కాల్పులు

- నలుగురు మృతి

వాషింగ్టన్ : గన్ కల్చర్ అమెరికాను వణికిస్తోంది. మిసిసిపి రాష్ట్రంలోని ఓ పాఠశాల సమీపంలో ఓ దుండగుడు విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 12మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వెల్లడించిన సమాచారం ప్రకారం.. శుక్రవారం రాత్రి లేలాండ్ నగరంలో అర్ధరాత్రి ఫుట్‌బాల్ ఆట ముగిసిన తర్వాత ఓ వ్యక్తి విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో నలుగురు మరణించారు. మరో 12 మంది గాయపడ్డారని ప్రముఖ వార్త సంస్థ బిబిసి నివేదించింది. శుక్రవారం రాత్రి రద్దీగా ఉండే సమయంలో లేలాండ్ ప్రధాన వీధిలో కాల్పులు జరిగాయని నగర మేయర్ జాన్ లీ తెలిపారు.

ఈ కాల్పుల ఘటనకు ముందు ఓ స్కూల్ సమీపంలో పాఠశాలల పూర్వ విద్యార్థులను స్వాగతించే వార్షిక అమెరికన్ సంప్రదాయ ఫుట్‌బాల్, ఇతర కమ్యూనిటీ ఈవెంట్‌లు జరిగాయి. ఈ ఈవెంట్‌లో 18 ఏళ్ల యువకుడు కాల్పులకు తెగబడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అధికారులు దర్యాప్తును కొనసాగిస్తున్నారనీ, నిందితుల్ని గుర్తించేందుకు ప్రత్యక్ష సాక్షులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పవన్ మాటల పవర్ ఎంత?

వంద రోజుల హామీపై మత్స్యకార గ్రామాల్లో విస్తృత చర్చ

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

'మాట వినాలి... చెబితే మాట వినాలి...' అంటూ ఇటీవల విడుదలైన పవన్ కల్యాణ్ సినిమాలో ఒక పాట ఉంది! సినిమా సంగతి ఎలా ఉన్నప్పటికీ ప్రజాక్షేత్రంలో పవన్ ఇచ్చిన హామీల అమలు విషయమే చర్చనీయాంశంగా మారింది. వంద రోజుల్లో మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తానంటూ కొద్దిరోజుల క్రితం డిప్యూటీ సిఎం పవన్ ప్రకటించిన విషయం తెలిసిందే. నిజానికి మత్స్యకారుల సమస్యలు కొత్తవేమి కావు! ఎన్నికల ముందు కూడా ఇవే ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తామనే ఇచ్చిన హామీతోనే మత్స్యకారుల ఓట్లు ఆయనకు పెద్దఎత్తున పడ్డాయి. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిపోయినా ఆ దిశలో అడుగులు పడకపోవడంతోనే తాజాగా వారు ఆందోళనకు దిగాల్సివచ్చింది. దాదాపుగా ఆ సమయంలోనే అసెంబ్లీ వేదికగా పారిశ్రామిక కాలుష్యాన్ని అరికట్టడం అసాధ్యమనే విధంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. పర్యావరణ శాఖ మంత్రికూడా ఆయనే కావడం గమనార్హం. ఆ తరువాతే మత్స్యకారుల ఆందోళన ఉధృతంగా మారింది. దీంతో మత్స్యకారుల వద్దకు వచ్చిన ఆయన సమస్యల పరిష్కారానికి వంద రోజుల సమయాన్ని కోరారు. తాను వారిలో ఒకడినేనని, భుజం తట్టిన వారు, భుజం మీద ఒకటి కొడితే మాత్రం తప్పేమిటంటూ సినిమాటిక్‌గా మాట్లాడారు. ఆ మాటల విషయం ఎలా ఉన్నప్పటికీ, ఏడాది కాలంగా పరిష్కారం కాని సమస్య వంద రోజుల్లో ఎలా పరిష్కారమవు తుందన్నది, అసలు సమస్యకు పరిష్కారం ఏమిటన్న మిగతా 5లో



కీలకంగా మారిటైం పాలసీ

రాష్ట్ర ప్రభుత్వం కొంతకాలం క్రితంఆమోదించిన మారిటైం పాలసీ మత్స్యకారుల పాలిట శాపంగా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తీర ప్రాంతంలో నౌకాశ్రయాలు, వాటి అనుబంధ పరిశ్రమలకు ఉద్దేశించిన ఈ పాలసీలో మత్స్యకారుల గురించి, సిఆర్‌జడ్ నిబంధనల గురించి నామమాత్రంగా కూడా ప్రస్తావించలేదు. అదే విధంగా పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యాన్ని అరికట్టే అంశంపై కూడా ఎటువంటి ప్రస్తావన లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికే విడుదలవుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు పారిశ్రామిక సంస్థలను ఒప్పిస్తారా? లేక చర్యలతో కట్టడి చేస్తారా అన్నది చూడాలసిందే.

ఇక ప్రైవేటు డిస్కమ్‌లు!



- ఆగని విద్యుత్‌రంగ వినాశకర సంస్కరణలు
- ప్రజా వ్యతిరేకతను భేఖాతరు చేస్తున్న కేంద్రం
- ఇప్పటికే ఉన్న నెట్‌వర్క్ కార్పొరేట్లకు అప్పగింత
- రాష్ట్రాలకు చేరిన ముసాయిదా బిల్లు

న్యూఢిల్లీ : ప్రజలపై పెనుభారం మోపుతున్న విద్యుత్ రంగ సంస్కరణలపై వ్యక్తమవుతున్న వ్యతిరేకతను కేంద్ర ప్రభుత్వం బేఖాతరు చేస్తోంది. విద్యుత్ రంగాన్ని మరింతగా వినాశకరంవైపు నడిపించే విధానాలను దేశ ప్రజానీకంపై రుద్దు తోంది. దీనిలో భాగంగానే అత్యంత కీలకమైన విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)లను ప్రైవేటీకరించడానికి సిద్ధమైంది. ఈ మేరకు రూపొందించిన ముసాయిదా బిల్లు-2025ను రాష్ట్రాలకు పంపింది. ఇది అమలులోకి వస్తే దశాబ్ధాల తరబడి అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని మారుమూల ప్రాంతాలకు సైతం వేసుకున్న కరెంటు లైన్ల నెట్‌వర్క్ కార్పొరేట్ సంస్థల పరమవుతుంది. ప్రైవేటు సంస్థలకు లాభాల లెక్కలు తప్ప, సేవా దృక్పథం ఉండదు కాబట్టి కరెంటు ఛార్జీలు కొండెక్కి కూర్చునే ప్రమాదం ఉంది. ఉచిత విద్యుత్ పథకాల అమలు కోసం ప్రభుత్వాలు కార్పొరేట్లపై ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుంది?

బహుళ కంపెనీలతో ధర తగ్గుతుందా?

ఒకే ప్రాంతంలో అనేక కంపెనీలను అనుమతించనున్నట్లు ముసాయిదాలో పేర్కొన్నారు. దీని ప్రకారం అనేక విద్యుత్ సంస్థలు పోటీ పడతాయని, ఫలితంగా ధర తగ్గుతుందని ప్రచారం చేస్తున్నారు. అయితే, వాస్తవం దీనికి భిన్నం. టెలికం రంగంతో బిఎస్ఎన్ఎల్‌తో పాటు అనేక సంస్థలు అనుమతించినప్పటికీ ధరలు తగ్గకపోగా పైపైకే పోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బలవంతంగా రుద్దతున్న స్మార్ట్‌మీటర్లతో ఛార్జింగ్ విధానం అమలులోకి వస్తుండగా, డిస్కమ్‌లు ప్రైవేటు పరమైతే సామాన్యుడికి కరెంటు షాక్‌లు నిత్యకృత్యంగా మారే ప్రమాదం ఉంది.

ప్రీమియం రేట్లు అమలు

విద్యుత్ కొరత ఏర్పడినప్పుడు ధరలు పెంచి ప్రీమియం రేట్లకు సరఫరాచేసే విధానాన్ని ప్రవేశ పెడతామని ముసాయిదాలో పేర్కొన్నారు. డిస్కమ్‌ల ఆదాయాన్ని పెంచడానికి, గ్యారంటీ చేయడానికి ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ నిరంతరాయంగా కోతలు లేకుండా సరఫరాచేయడానికి, డిమాండ్‌ను తగ్గిండానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రసుతానికి పారిశ్రామిక, వ్యాపార సంస్థలకు ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపినప్పటికీ భవిష్యత్‌లో సామాన్యులకు వర్తింపచేయరన్న నమ్మకమేమి లేదు. అంటే, ప్రజానీకంపై ప్రీమియం రేట్ల కత్తి వేలాడుతున్నట్లే! ఇక వినియోగదారులందరికి తప్పనిసరిగా విద్యుత్‌ను సరఫరా చేసే బాధ్యత నుండి ప్రభుత్వ డిస్కమ్‌లను తప్పించనున్నారు. అంటే, పంపిణీ నుండి ప్రభుత్వ రంగాన్ని తప్పించడంతో పాటు వినియోగదారులను కార్పొరేట్ సంస్థల దయాదాక్షిణ్యాలకు వదిలివేయడమే.

ఇఆర్‌సిలకు సుమోటో అధికారాలు

విద్యుత్ సంస్థల నుండి ప్రతిపాదనల కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్లు తమంతట తాముగా టారీఫ్‌లను సవరించే అధికారాన్ని ఈ బిల్లు కట్టబెట్టనుంది. దీంతో ప్రస్తుతం నామమాత్రంగానైనా నడుస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ పద్దతులు భవిష్యత్తులో కనుమరగు అయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వానికి ప్రమేయం ఉండకపోవడంతో కార్పొరేట్ల ఇష్టా రాజ్యం కొనసాగే అవకాశం ఉంది. పైగా టారీఫ్‌లను సవరించడంలో జాప్యాలను తగ్గించడానికి సుమోటో హక్కును ఇఆర్‌సిలకు ఇస్తున్నట్లు పేర్కొనడం గమనార్హం.

ఇప్పుడెందుకు...?

ప్రపంచబ్యాంకు విధానాల్లో భాగంగానే ఈ సంస్కరణలు అమలవుతున్నాయి. గతంలో రాష్ట్రాల వారీగా వీటిని అమలు చేయగా ఇప్పుడు గంపగుత్తగా ఢిల్లీ నుండే అమలు చేస్తున్నారు. పాలకపార్టీల కార్పొరేట్ అనుకూల విధానాలు దీనికి కారణం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు విడుదల చేసే నిధులకు, విద్యుత్ సంస్కరణలకు ముడి పెడుతోంది, తేనే పూసిన కత్తి తరహాలో మాయమాటలతో ప్రజలను మభ్య పెడుతూ ఈ విధానాలను అమలు చేస్తున్నారు. డిస్కమ్‌లను ప్రైవేటీకరించడానికి ఉద్దేశించిన తాజా బిల్లులో ప్రభుత్వ డిస్కమ్‌లు నష్టాల్లో ఉన్నాయని, ఎంత మొత్తంలో నిదులు కేటాయిస్తున్నా నష్టాల నుండి బయటపడలేకపోతున్నాయని పేర్కొన్నారు. నిజానికి డిస్కమ్‌లు నష్టాల్లో పడటానికి ప్రభుత్వం అనుసరించిన విధానాలే కారణమన్న విషయాన్ని దాచిపెడుతున్నారు. మన రాష్ట్రంలోని ఇపిడిసిఎల్ దేశంలోనే అత్యుత్తమ సంస్థగా, పూర్తి స్థాయి లాభాలతో కొన్ని సంవత్సరాల కిందటి వరకు కొనసాగడం దీనికి నిదర్శనం,. ఇక పోటీ పెంచడానికి, మార్కెట్ క్రమశిక్షణ ప్రవేశపెట్టడానికి డిస్కమ్‌లను ప్రైవేటీకరిస్తున్నట్లు ముసాయిదాలో పేర్కొన్నారు.

బిసి హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సిఎం ఆరా

- ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా చర్యలకు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, అన్నపర్రు బిసి బాలురు హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సిఎం చంద్రబాబు, బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత ఆరా తీశారు. విద్యార్థుల అనారోగ్య కారణాలకు కారణాలేమిటనే విషయం శనివారం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ పాయిజన్ వల్లే ఈ ఘటన జరిగిందని ముఖ్యమంత్రికి వైద్యులు ప్రాథమికంగా చెప్పారని అధికారులు వివరించారు. నీరు, ఆహార నమూనాలను పరీక్షలకు పంపి రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. ఆస్పత్రిలోని విద్యార్థుల పరిస్థితిని తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం గుంటూరు జనరల్ ఆస్పత్రిలో 24 మంది విద్యార్థులు ఉన్నారని, వీరిలో ఒక విద్యార్థికి ఇతర అనారోగ్య సమస్యలు కూడా ఉండటంతో ఐసియులో ఉంచి ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. పెదనందిపాడు వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరు మినహా అందరినీ డిశ్చార్జ్ చేశామని తెలిపారు. నిపుణుల సూచనలతో ఓ విద్యార్థినిని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.



దేవళంపేట గ్రామంలో సంఘీభావ సమావేశంలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

పాపికొండల విహారయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - దేవీపట్నం (అల్లూరి జిల్లా)

గోదావరి వరదల వల్ల మూడు నెలలుగా నిలిచిపోయిన పాపికొండల విహారయాత్ర శనివారం నుంచి పున:ప్రారంభమైంది. దేవీపట్నం మండలంలోని మాతృశ్రీ గండి పోచమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఈ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. తొలిరోజు ఈ యాత్రకు 20 మంది యాత్రికులు వెళ్లారు. అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాట్లు చేశారు.

ప్రైవేటు కళాశాలలకు డబ్బులిచ్చేందుకే ఆరోగ్యశ్రీ

- బొత్సకు జగన్ నుంచి ప్రాణహాని
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తీవ్ర ఆరోపణలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు డబ్బులిచ్చే విధానమే కదా? అని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు నిలదీశారు. ఆరోగ్యశ్రీ పథకం తీసుకురాకుండా అప్పుడే ప్రభుత్వ కళాశాలలు పెట్టొచ్చు కదా? అని ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నారని జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాలలకు రూ.8,700 కోట్లు కావాల్సి ఉంటే వైసిపి కేవలం రూ.1,400 కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. . రాష్ట్రంలో కల్తీ మద్యానికి జగనే ఆద్యుడని, కుంభకోణం మొత్తాన్ని ఆయనే ప్రోత్సహించారని ఆరోపించారు. వైసిపి ముసుగు వేసుకొని టిడిపిలోకి వచ్చారని, వాళ్లను ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ ప్రాణహాని ఉందని ప్రకటించారని తెలిపారు. బొత్స మాటలను బట్టి చూస్తే జగన్ వల్లే ఆయనకు ప్రాణహాని ఉందని విమర్శించారు. వైసిపిలో ఎక్కువ పేరు సంపాదించుకున్న వాళ్లను జగన్ అంతం చేస్తారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతగా బొత్స బాగా ఫోకస్ అవుతున్నారని, శాసనమండలిలో బొత్స పనితీరు బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వ పరంగా బొత్సకు భద్రత కల్పిస్తామన్నారు. ఆరేళ్ల నుంచి రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారడానికి కారణం జగనే అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. గతంలో సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల్లో వైసిపి నాయకులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కల్తీ మద్యంలో భాగస్వాములైంది, వారిపై కేసులు ఉన్నది నిజం కాదా? అని ప్రశ్నించారు. వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

మెడికల్ కాలేజీల్లో ప్రైవేటు పెత్తనంపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) విధానాన్ని అమలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిల్ దాఖలైంది. దీనివల్ల 10 మెడికల్ కాలేజీల్లో పెద్ద సంఖ్యలో సీట్లను కోల్పోవాల్సి వస్తోందని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బండెల గౌతమ్‌కుమార్ పిల్ దాఖలు చేశారు. 'ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల ఫీజులు పెరుగుతాయి. దీంతో పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. 50 శాతం సీట్లు మేనేజ్‌మెంటు కోటా కిందకు వెళ్లిపోతాయి. ఒక్కో సీటు రూ.కోటి వరకు చేరుతుంది. కన్వీనర్ కోటాలో మిగిలిన 50 శాతం సీట్లకు పెద్దమొత్తంలో ఫీజులు వసూలుకు వీలుంది. పిపిపి విధానం రాజ్యాంగ విరుద్ధం, ఏకపక్షమని ప్రకటించాలి. ప్రభుత్వ ఆధ్వర్యాన 100 శాతం సీట్లు భర్తీ జరిగేలా చేయాలి' అని దాఖలు చేసిన పిల్‌లో పేర్కొన్నారు. ప్రతివాదులుగా ఆరోగ్య, కటుంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి, ఎపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యదర్శులను చేర్చారు.

విద్యుత్ సుంకం 6 పైసలకు తగ్గించాలి

- ప్రభుత్వం కోర్టులో పిటిషన్ ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా వ్యాపార, వాణిజ్య, పరిశ్రమ (ఎంఎస్ఎంఇ)ల నుంచి వసూలు చేస్తున్న విద్యుత్ సుంకాన్ని రూపాయి నుంచి 6 పైసలకు తగ్గించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అప్పీలును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. 1939 ఎలక్ట్రిసిటీ డ్యూటీ చట్ట ప్రకారం యూనిట్‌కు 6 పైసలు చొప్పున విద్యుత్ సుంకం వసూలు చేస్తున్నారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం రెండుసార్లు చట్టాన్ని సవరించి, రెండు జిఓలు విడుదల చేసి, నివాస గృహాలకు కాకుండా మిగిలిన వినియోగదారులందరి నుంచి యూనిట్‌కు ఆరు పైసలు నుంచి రూపాయికి విద్యుత్ సుంకాన్ని పెంచిందని గుర్తు చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ వివిధ వ్యాపార, వాణిజ్య సంఘాలు, సంస్థలు హైకోర్టులో 1,745 రిట్ పిటిషన్లు దాఖలు చేశాయని వివరించారు. హైకోర్టు వివిధ కారణాలతో జిఓలను కొట్టివేసి, 6 పైసలు మాత్రమే వసూలు చేయాలని ఆదేశాలిచ్చిందని వివరించారు. 2021 నుంచి వసూలు చేసిన బకాయిలను కూడా తిరిగి చెల్లించాలని ఆదేశించిందని వెల్లడించారు. విద్యుత్ భారాలను తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా మరో చట్ట సవరణ చేసి విద్యుత్ సుంకాన్ని పగడ్బందీగా వసూలు చేయటానికి ఆదేశాలివ్వటం శోచనీయమని పేర్కొన్నారు.

హైకోర్టు తీర్పును అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం.. సుప్రీంకోర్టులో అప్పీలు చేసిందని వెల్లడించారు. సుప్రీంకోర్టు కూడా కొన్ని కేటగిరీలకు రూపాయి పెంచడాన్ని తప్పు పట్టి 6 పైసలు మాత్రమే వసూలు చేయాలని ఆదేశాలిచ్చిందని తెలిపారు.

2021 నుంచి ఇప్పటి వరకు వసూలు చేసిన బకాయిలు కూడా తిరిగి చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ప్రస్తుతానికి స్టే ఇస్తూ ఫిబ్రవరికి వాయిదా వేసిందని వివరించారు. ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థలు కోర్టు తీర్పును పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కోర్టుకు వెళ్లిన వారికి మాత్రమే సుంకాన్ని తగ్గించడం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే అవుతుందని తెలిపారు. కావున కోర్టు ఆదేశాలకు అనుగుణంగా 2021 నుంచి వసూలు చేసిన బకాయిలను వినియోగదారులందరికీ తిరిగి చెల్లించాలని వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

విగ్రహాలకు నిప్పుపెట్టి వైసిపి రాజకీయం

- హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - వెదురుకుప్పం

చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామ వైసిపి నేత, దళిత సర్పంచ్ చేత అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టించి, మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి రోడ్డుపైకి వచ్చి నిరసనలు చేయడం డ్రామాలా ఉందన్నారు. అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టి వైసిపి వాళ్లు రాజకీయం చేశారన్నారు. దేవళంపేట గ్రామంలో నిర్వహించిన సంఘీభావ సమావేశంలో హోం మంత్రి అనిత పాల్గొన్నారు. నూతన అంబేద్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పూలమాలవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన చోటే తిరిగి విగ్రహాన్ని ప్రతిష్టించామన్నారు. వైసిపి నాయకులంతా కలిసి టిడిపి నాయకుడిని నిందితుడిని చేసి అరెస్టు చేయాలని ధర్నా చేశారని, ఆ రోజంతా ఓ డ్రామాలా సాగిందన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, కరుణాకర్‌రెడ్డి నిజాలు తెలుసుకుని రోడ్డుపైకి రావాలన్నారు. తాను ఈ రోజు రాష్ట్రానికి హోంశాఖ మంత్రి అయ్యానంటే రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పెట్టిన భిక్షేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి దగ్గుమల్ల ప్రసాదరావు, స్థానిక ఎమ్మెల్యే విఎం థామస్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

- అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ పివి రమణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బాణసంచా తయారీ నిర్వహణ, నిల్వ ప్రక్రియల్లో భద్రతా ప్రమాణాలను పాటించడం తప్పనిసరని అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ పివి రమణ తెలిపారు. అగ్ని ప్రమాదాలు, పేలుళ్లను నివారించేందుకు నిర్దేశించిన ఎస్‌ఒపిని కచ్చితంగా పాటించాలన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పేలుడు పదార్థాల నియమాలు-2008కు అనుగుణంగా లైసెన్స్ పొందిన తయారీదారులు విధిగా భద్రతా చర్యలు పాటించాలని, వీటిలో ముఖ్యంగా తయారీ భవనాలు, బేస్‌మెంట్లు లేకుండా ఒకే అంతస్తు నిర్మాణాలు ఉండాలన్నారు. బాణసంచా తయారీ షెడ్లు బకదానికొకటి, జనావాస ప్రాంతాల నుంచి కనీసం 45 మీటర్ల సురక్షిత దూరంలో ఉండాలన్నారు.

కర్మాగారాల్లో ధూళి, దుమ్ము లేకుండా జాగ్రత్తలతో గృహ నిర్వాహక పద్ధతులను పాటించాలన్నారు. తయారీ కార్యకలాపాలు ఉదయం 7:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు మాత్రమే నిర్వహించుకోవాలన్నారు. ప్రతి కార్మికుడు వ్యక్తిగత రక్షణ పరికరాలు (పిపిఇ) ధరించాలని, 18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారిని, మద్యం సేవించిన వారిని ఫ్యాక్టరీలోకి అనుమతించకూడదన్నారు. భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



కోవూరు వద్ద ట్రావెల్ బస్సు బోల్తా

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-కోవూరు

నెల్లూరు జిల్లా కోవూరు మండలంలోని ఆర్‌కె పెట్రోల్ బంక్ సమీపంలో శనివారం తెల్లవారు జామున ప్రయివేటు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ సహా పది మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికుల సమాచారం ప్రకారం... భువనేశ్వర్ నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న శ్రీ నవీన్ ట్రావెల్స్ బస్సు కోవూరు మండలం ఆర్‌కె పెట్రోల్ బంకు వద్దకు రాగానే బస్సుపై డ్రైవర్ పట్టు కోల్పోయారు.

దీంతో బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. తిరుపతికి చెందిన నాలుగేళ్ల సంవిక అనే చిన్నారి తీవ్రంగా గాయపడగా, ఆమెను నెల్లూరు అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగతా వారికి స్థానిక ప్రయివేట్ ఆసుపత్రుల్లో ప్రాథమిక చికిత్స పొందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న కోవూరు సిఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ బృందంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా 20న రాష్ట్ర వ్యాప్త నిరసనలు

- రైతు, కౌలు రైతు, వ్యకాస పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమెరికా అధ్యక్షులు ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్త నిరసనలకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చాయి. విజయవాడ ఎంబివికెలో శనివారం ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు వి కృష్ణయ్య, వై కేశవరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం సూర్యనారాయణ, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు. 60 శాతం సుంకాలతో ట్రంప్ ప్రభుత్వం ఆక్వా రైతుల నడ్డి విరుస్తోందన్నారు. భారత వ్యవసాయ రంగాన్ని రైతు, కౌలు రైతులు, కూలీలను నాశనం చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాద ట్రంప్ సుంకాల యుద్ధానికి వ్యతిరేకంగా ఉద్యమం చేయాలన్నారు. దేశం నుంచి ఎగుమతి సుంకాల విధింపులు, దిగుమతులపై సుంకాల తొలగింపులు రైతాంగానికి ముప్పని, ఇదే సందర్భంలో అమెరికా కుయుక్తులకు ప్రధాని మోడీ మోకరిల్లుతున్నారని నేతలు పేర్కొన్నారు. ఆక్వా రంగం మీద పక్కనే ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకకు 19.20 శాతం, ఈక్విడార్‌పై 13 శాతం సుంకం వేసిన అమెరికా.. దేశంపై సుమారు 60 శాతం వేయడం దారుణమన్నారు. అమెరికా నుంచి దేశానికి దిగుమతి అయ్యే పత్తి మీద గతంలో 11 శాతం సుంకాలు వేసేవారని, అమెరికా ఒత్తిడికి మోడీ 11 శాతం సుంకాన్ని పూర్తిగా తీసేశారన్నారు. దీంతో దేశంలోని అనేక కంపెనీలు తక్కువ రేటుకు విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకుంటున్నాయన్నారు. దేశంలో పత్తి రైతులు ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా నుంచి దేశానికి దిగుమతయ్యే పాల ఉత్పత్తులైన జున్ను మీద 30 శాతం, వెన్నమీద 40, పాలపొడి మీద 60 శాతాలు చొప్పున సుంకాలు మన ప్రభుత్వం విధిస్తోందన్నారు. ఈ సుంకాలను తగ్గించాలని అమెరికా, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోందన్నారు. సుంకాల తగ్గింపు జరిగితే మన దేశంలో పాడి రైతాంగం దెబ్బతినడమే కాకుండా అమూల్ వంటి సంస్థలు కూడా మూసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని నేతలు అన్నారు. వస్త్ర పరిశ్రమ నుంచి దుస్తులు అమెరికాకు 11 బిలియన్ డాలర్ల సరుకు ఎగుమతవుతోందని, ట్రంప్ సుంకాల వల్ల 70 శాతం షిప్‌మెంట్ నిలిచిపోయే ప్రమాదముందన్నారు. ట్రంప్ సుంకాలను, అమెరికా సామ్రాజ్యవాదానికి, ప్రధాని మోడీ మోకరిల్లకుండా చర్చలు జరిపి దీటుగా ఎదుర్కోవాలని కోరారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న నాయకులు

నకిలీ మద్యంపై ప్రజాగ్రహం

- పట్టుబడిన షాపులో బాటిళ్లు పగులగొట్టిన మహిళలు
- షట్టర్లు మూసివేసి ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

నకిలీ మద్యంపై విజయవాడలో ప్రజాగ్రహం వ్యక్తమైంది. కల్తీ మద్యం పట్టుబడిన విజయవాడ విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్‌లో ఇంకా అమ్మకాలు సాగించడాన్ని నిరసిస్తూ శనివారం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. తొలుత నకిలీ మద్యం భూతం ప్లకార్డులు, అరుణ పతాకాలు చేతబూని ప్రదర్శనగా వచ్చిన మహిళలు, కార్యకర్తలు శ్రీనివాస వైన్స్‌లో నకిలీ మద్యం సీసాలను పగలగొట్టి, వైన్స్ షాపును మూయించేసి నిరసన తెలిపారు. ఇంకా అమ్మకాలు కొనసాగించడంతో మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. షాపు లైసెన్స్ రద్దు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని షట్టర్లు మూసివేసి బైఠాయించారు. గంటకుపైగా ఈ ఆందోళన సాగింది. ఎట్టకేలకు పోలీసు, ఎక్సైజ్ శాఖ అధికారులు అక్కడికి వచ్చి తక్షణమే అమ్మకాలు నిలిపివేయిస్తామని, వారం రోజుల్లో అధికారికంగా లైసెన్స్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో కార్యకర్తలు, మహిళలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, పశ్చిమ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు, ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కాజ సరోజ, జిల్లా నాయకురాలు ఆదిలక్ష్మి మాట్లాడారు. దశలవారీగా మద్యాన్ని నియంత్రిస్తామని, నకిలీ మద్యాన్ని అరికడతామని, ప్రజల ప్రాణాలు, ఆరోగ్యాలు కాపాడుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం దగా చేసిందని విమర్శించారు. ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, విజయవాడతో సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కల్తీ మద్యం దందా విస్తరించిందని, నకిలీ మద్యం ఏరులై పారుతోందని అన్నారు. ఈ కల్తీ మద్యం కుంభకోణానికి టిడిపి కూటమి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.



షట్టర్లు మూసి వేసి నిరసన తెలుపుతున్న మహిళలు, సిపిఎం కార్యకర్తలు

సచివాలయాల ఉద్యోగులకే పి-4 బాధ్యతలు

- బంగారు కుటుంబాల గుర్తింపు, మార్గదర్శకుల ఎంపిక
- కీలక శాఖల మధ్య కొరవడిన సమన్వయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పి-4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టనర్ షిఫ్) అమలులో భాగంగా మార్గదర్శకుల ఎంపిక బాధ్యతను గ్రామ, వార్డు సచిలయాల ఉద్యోగులకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక వైపు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నిరుపేదలను (బంగారు కుటుంబాలు) గుర్తించడం, మరోవైపు వారిని ఆదుకునేందుకు మార్గదర్శకుల ఎంపికను తమకే అప్పగించడంపై సచివాలయాల ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఆయా శాఖల అధికారులు సమన్వయంతో చేయాల్సిన ఈ బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు అప్పగించి మిగతా శాఖల వారు చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు ఉన్నాయి. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, విద్యా, వైద్య సంస్థల నిర్వహాకులు, స్వచ్ఛంద సంస్థల వారు వేర్వేరు కార్యకలాపాలతో వివిధ శాఖల పరిధిలో అనుసంధానంగా ఉంటారు. వీరిని ఒప్పించి పేదలకు సాయం అందించేందుకు చర్యలు తీసుకోవాల్సిన కీలకమైన ప్రభుత్వ శాఖల అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారు.

మార్గదర్శకులుగా ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై ఇటీవల సచివాలయాల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. బంగారు కుటుంబాల్లోని పేదలకు ఉన్న అవసరాలను గుర్తించడం, ఒక్కో మార్గదర్శికి 20 కుటుంబాలు తక్కువ కాకుండా అప్పగించడం సచివాలయాల ఉద్యోగుల బాధ్యతగా అప్పగిగంచారు. ఇందుకు సంబంధించి వీరు ఎప్పటికప్పుడు పి-4 పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలి. ఎంపిక చేసిన మార్గదర్శకులను ఈ పోర్టల్‌లో నమోదు చేయాలి. వారు ఏయే ప్రాంతాలకు చెందిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటారో ఆయా వివరాలను కూడా ఈ పోర్టల్‌తో పాటు యాప్‌లో కూడా అప్‌లోడ్ చేయాలి. బంగారు కుటుంబాలకు సంబంధించి మార్గదర్శకులతో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాల ఎంపిక నిరంతర ప్రక్రియ అని చెబుతున్నారు.

నవంబరు 15 నుండి విజయవాడ - సింగపూర్‌కు విమాన సర్వీస్

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - విజయవాడ : గన్నవరం విమానాశ్రయం నుండి సింగపూర్‌కు నూతన విమాన సర్వీస్‌ను ఇండిగో సంస్థ ప్రారంభించనుంది. ఈ విషయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం మీడియాకు వెల్లడించారు. విజయవాడ నుండి వారానికి మూడుసార్లు మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసు ఉండనుందని, నవంబర్ 15 నుండి ఈ ఇండిగో విమాన సర్వీసు ప్రారంభం కానుందనితెలిపారు. విజయవాడ నుండి సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయాల మధ్య నేరుగా వారానికి మూడు సార్లు ఈ సర్వీసు సేవలందిస్తుందని తెలిపారు.

పెన్షన్ సంస్కరణలు రద్దు చేయాలి

- డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

పెన్షన్ సంస్కరణలు రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో విశాఖ జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి మణి మాట్లాడుతూ 8వ వేతన సంఘం ఏర్పాటుకు, పాత పెన్షన్ విధానం కోసం పోరాటాలు నిర్వహించాలన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశానుసారం కార్పొరేట్ల మెప్పు కోసం పనిచేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలను, కార్మికులను విచ్ఛిన్నం చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. అందులో భాగమే రకరకాల పేర్లతో పెన్షనర్లను విడగొట్టాలని కేంద్రం చూస్తోందని తెలిపారు. ప్రభుత్వ రంగ ఉద్యోగులను తగ్గించి కాంట్రాక్టు, దినసరి కార్మికులను చేర్చుకుంటున్నారని చెప్పారు. బలంగా ఉన్న కార్మికోద్యమాలను నిర్వీర్యం చేయడం కోసం లేబర్ కోడ్స్‌ను తీసుకు వచ్చారన్నారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతోనే పెన్షన్ రక్షణ సాధ్యమన్నారు. 8వ వేతన సంఘ చైర్మన్, కమిటీ సభ్యులను వెంటనే నియమించి విధి విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. నావెల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐడిఇఎఫ్ మాజీ కార్యవర్గ సభ్యులు ఇ శ్రీనివాసరావు, ఎన్‌సిఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్, ఎస్‌బిసి యూనియన్ కార్యదర్శి షాబూజి, సిఐటియు కన్వీనర్ రాజేష్, వై శేఖర్, టిఎన్‌టియుసి నాయకులు పరమేష్ పాల్గొన్నారు.





ధర్నాచౌక్‌లో దీక్షశిబిరం వద్ద ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు , పాల్గొన్న వైద్యులు

సమస్యలు పరిష్కరించకుంటే 'సమ్మె'

- రేపటి నుంచి నల్ల బ్యాడ్జీలతో నిరసన
- పిహెచ్‌సి వైద్యుల రౌండ్‌టేబుల్ తీర్మానం
- పలు యూనియన్ల మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) వైద్యుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల సంఘం (ఎపిపిహెచ్‌సిడిఎ) విజయవాడలోని ధర్నా చౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 7వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా అక్కడే రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పలు సంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ వైద్యులకు పిజి సీట్లలో 15 శాతానికి కుదించడం వల్ల పేద ప్రజలకు మెరుగైన స్పెషలిస్టు సేవలు అందించడం తగ్గుతుందని పేర్కొన్నారు. గతేడాది నుంచి ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పినా ఇప్పటికీ పరిష్కరించలేదన్నారు. 104 సేవల్లో చెల్లించాల్సిన అదనపు పారితోషికాన్ని ఏళ్లతరబడి చెల్లించడం లేదన్నారు. వైద్యారోగ్య రంగంలోని సేవలన్నీ ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌సి వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

తమ ప్రాథమిక హక్కులు సాధించే వరకు కొనసాగిస్తామని తెలిపారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ పాల్గొని వైద్యుల ఆందోళనకు మద్దతు తెలిపారు. పిహెచ్‌సి వైద్యుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాయక్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో ఎపి సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు బి కాంతారావు, 108 ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బి కిరణ్‌కుమార్, ఎన్‌హెచ్‌ఎం జెఎసి చైర్మన్ దయామణి, కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, కాంట్రాక్టర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి జి భరణి, ఆయుష్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు అంజలి, ఎపి ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షులు కె ధనలక్ష్మి, కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, యుపిహెచ్‌సి ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నరాజు, ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ యువి కృష్ణయ్య, ప్రజారోగ్య వేదిక నాయకులు జి విజయ ప్రకాష్ తదితరులు పాల్గొన్ని వైద్యుల ఆందోళనకు మద్దతు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే వైద్యుల సమ్మెకు మద్దతుగా తాము కూడా కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

జనార్ధనరావుకు రిమాండ్

విజయవాడ : ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో నిందితుడు జనార్దన్‌రావుకు న్యాయస్థానం ఈనెల 17 వరకు రిమాండ్ విధించింది. రహస్య ప్రదేశంలో ఆయనను విచారించిన పోలీసులు శనివారం కోర్టులో హాజరుపరిచారు. నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారం జనార్ధనరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో వెలుగు చూసిన నకిలీ మద్యం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. టిడిపికి చెందిన నేతలే ఈ కేసులో ఉండడం చర్చనీయాంశమైంది. విదేశాల్లో ఉంటూ వీడియోలు రిలీజ్ చేస్తూ కేసులో తన పాత్ర లేదని చెబుతూ వచ్చిన జనార్ధనరావు గన్నవరం విమానాశ్రయంలో దిగిన వెంటనే పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుండి రహస్య ప్రాంతంలోకి తీసుకెళ్లి విచారించినట్లు తెలిసింది. అనంతరం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

అప్పలరాజు అక్రమ నిర్బంధాన్ని ఖండించండి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజును పోలీసులు కొన్ని రోజులుగా గృహ నిర్బంధం చేయడాన్ని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ మేరకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వం తక్షణమే ఆయనను అక్రమ నిర్బంధం నుంచి విడుదల చేయాలన్నారు. పోలీసులు అక్రమంగా గృహ నిర్బంధించడాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

ప్రభుత్వ ఆధీనంలోనే వైద్య కళాశాలలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - పెనుకొండ, మార్కాపురం

రాష్ట్రంలో వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆపాలని కోరుతూ శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అభివృద్ధి వేదిక నాయకులు రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ పెనుకొండలోని వైద్య కళాశాలకు గత ప్రభుత్వం రూ.30 కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఇప్పుడు ప్రయివేటుకు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. కోవిడ్ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలే ప్రజలను ఆదుకున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి మెడికల్ కళాశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఫీజులు నామ మాత్రంగా ఉంటాయని, ప్రయివేటు పరమైతే లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచించి మెడికల్ కళాశాలల ప్రయివేటీకణ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సి.రామకృష్ణ మాట్లాడుతూ... టిడిపి కూటమి ప్రభుత్వం పేదలకు వైద్యం అందించే బాధ్యతల నుంచి తప్పు కోవడం దుర్మార్గం అన్నారు. జెవివి రాష్ట్ర నాయకులు ఆదిశేషు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా పిపిపి మోడల్ విజయవంతం కాలేదన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలను ఆదుకున్నది ప్రభుత్వ వైద్యమేనన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

మార్కాపురం మెడికల్ కాలేజీని పరిశీలించిన లక్ష్మణరావు

ప్రకాశం జిల్లా మార్కాపురం సమీపంలోని రాయవరం వద్దనున్న మెడికల్ కళాశాలను మాజీ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.జయప్రకాష్, రాష్ట్ర కార్యదర్శి పి.స్వరూపరెడ్డి, జిల్లా నాయకులు యు.వెంకట్రావు, జి.శ్రీనివాసరెడ్డి, బి.శ్రీరాములు, షేక్ బషీరున్నీసా బేగంతో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ మెడికల్ కాలేజీ ప్రధాన భవనం 70 శాతం పూర్తయిందన్నారు. ఇటువంటి దాన్ని పిపిపి విధానంలోకి మార్చడం పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలకు భంగం కలిగించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న పది మెడికల్ కళాశాలల నిర్మాణాలను ప్రభుత్వమే పూర్తిచేసి, నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పిఎస్‌బిల ప్రయివేటీకరణకు కుట్ర

- బయటి వ్యక్తుల నియామకాలపై ఉద్యోగుల ఆందోళన
- బ్యాక్‌డోర్ చర్యలను అంగీకరించం : యుఎఫ్‌బియు

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల్లో అత్యున్నత స్థాయి పోస్టులను బయటి వ్యక్తులతో భర్తీ చేయడమంటే ఈ రంగాన్ని ప్రయివేటీకరించే కుట్రేనని బ్యాంకింగ్ ఉద్యోగులు, ఉన్నతాధికారులు, సంఘాల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. పిఎస్‌బిలు, బీమా కంపెనీలలో ఉన్నత నాయకత్వ పదవులను ప్రయివేటు అభ్యర్థులకు ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని భారతదేశం అంతటా లక్షలాది బ్యాంకు ఉద్యోగులను ప్రాతినిధ్యం వహిస్తున్న తొమ్మిది యూనియన్ల వేదిక యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) తీవ్రంగా ఖండించింది. ఇది ప్రభుత్వ రంగంపై దాడి అని అభివర్ణించింది. పబ్లిక్ సెక్టర్ బ్యాంకులు, బీమా కంపెనీలలో మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హోల్ టైమ్ డైరెక్టర్, పదవులను ప్రయివేటు రంగ అభ్యర్థులకు కట్టబెట్టేలా కేంద్ర ప్రభుత్వంలోని అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్ (ఎసిసి) మార్గదర్శకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ మార్గదర్శకాల చట్టబద్ధతను ఎఐబిఇఎ, ఎఐబిఒసి, బెఫీ, ఎన్‌సిబిఇ, ఎఐబిఒఎ, ఐఎన్‌బిఒసి, ఎన్‌ఒబిడబ్ల్యు, ఎన్‌ఒబిఒ సంఘాల ఉమ్మడి వేదిక యుఎఫ్‌బియు సవాల్ చేసింది.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యాక్ట్ 1955, బ్యాంకింగ్ కంపెనీస్ యాక్ట్ 1970, 1980, ఎల్‌ఐసి యాక్ట్, 1956లను సవరించకుండానే ఈ మార్గదర్శకాలు జారీ చేయడం చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తుందని తెలిపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 73 మరియు 77 ప్రకారం.. కేంద్ర ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ అధికారాలు పార్లమెంటు చేసిన చట్టాలకు అనుగుణంగా ఉండాలని యుఎఫ్‌బియు నొక్కి చెప్పింది. అర్హత లేదా నియామక ప్రక్రియలలో ఏదైనా మార్పు చట్టసభ సవరణ ద్వారా జరగాలని.. కేవలం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా కాదని స్పష్టం చేసింది.



సీనియర్ పబ్లిక్ సెక్టర్ బ్యాంకర్లు కూడా ఈ పాలసీ మార్పుపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేశారు. "ఇది పిఎస్‌బిల ఉనికికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఎస్‌బిఐ లాంటి పెద్ద సంస్థల్లో ఒక ప్రొబేషనరీ ఆఫీసర్ సంవత్సరాల సేవ, అనుభవం ద్వారా చైర్మన్‌గా ఎదగగలడు. ప్రభుత్వ చర్యలతో వారికి ఇకపై ఆ అవకాశాలు దక్కవు. బాహ్య అభ్యర్థులను ఉన్నత స్థానాల్లోకి అనుమతించడం వల్ల ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థలు దెబ్బతినవచ్చును." అని ఓ సీనియర్ అధికారి బిజినెస్ స్టాండర్డ్‌తో పేర్కొన్నారు.

యుఎఫ్‌బియు ఎందుకు వ్యతిరేకిస్తోంది..!

- ప్రయివేటు వ్యక్తులతో నియామకమే చట్టవిరుద్ధం.
- ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల లక్ష్యాలు దెబ్బతింటాయి.
- అంతర్గత ఉద్యోగులకు పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం.
- నియామకాల్లో ప్రయివేటు హెచ్‌ఆర్ సంస్థలు ప్రవేశిస్తాయి.
- ప్రభుత్వ అనుకూల ప్రయివేటు వ్యక్తుల ఆధిపత్యం పెరగొచ్చు.

"ఎసిసి మార్గదర్శకాలు ప్రభుత్వ రంగ విత్త సంస్థలపై నిర్మాణాత్మక దాడి. పబ్లిక్ సెక్టర్ బ్యాంకింగ్, బీమా అనేవి ప్రయోగాల కోసం వస్తువులు కాదు. అవి ఆర్థిక న్యాయం. జాతీయ సార్వభౌమత్వ రాజ్యాంగ సాధనాలు. పబ్లిక్ సెక్టర్ బ్యాంకింగ్ వ్యవస్థ భారతదేశ ఆర్థిక సార్వభౌమత్వానికి వెన్నెముక. వాటి స్వభావాన్ని నిర్వీర్యం చేయడానికి లేదా ప్రయివేటీకరించడానికి బ్యాక్‌డోర్ ఎగ్జిక్యూటివ్‌ల నియామకాలను మేము అనుమతించము." అని యుఎఫ్‌బియు పేర్కొంది.

పది టన్నుల ఎర్రచందనం స్వాధీనం
ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

శేషాచలం నుంచి అక్రమంగా రవాణా చేసిన 356 ఎర్రచందనం దుంగలను ఢిల్లీలో టాస్క్‌ఫోర్స్ (ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక కార్యదళం) సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. 9,576 కిలోల ఎర్రచందనం విలువ బహిరంగ మార్కెటులో రూ.ఎనిమిది కోట్లు ఉంటుందని సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం తిరుపతి జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు, తిరుపతి అటవీ శాఖ సర్కిల్ సిసిఎఫ్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి పవన్ కుమార్ రావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆగస్టు రెండున టాస్క్‌ఫోర్స్ బృందం కడప జిల్లా ఖాజీపేట మండలం పత్తూరు ప్రాంతంలో రాజ్‌కుమార్ అనే ఎర్రచందనం స్మగ్లర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో భాగంగా కొంతమంది నిందితులు ఢిల్లీ ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక బృందాలు ఢిల్లీకి వెళ్లి సౌత్ ఈస్ట్ ఢిల్లీ తుగ్లకాబాద్ ప్రాంతంలో దాడులు నిర్వహించింది. అంతర్రాష్ట్ర స్మగ్లర్ హైదరాబాద్ హకీంపేట్ ప్రాంతానికి చెందిన మొహమ్మద్ ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారంతో తుగ్లకాబాద్ కుయన్ మొహల్లా ప్రాంతంలోని గోదాముపై దాడి చేసి 356 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అతనికి సహకరించిన మహారాష్ట్రకు చెందిన అమిత్ సంపత్ పవార్‌ను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోందని, ఈ ఎర్రచందనం అక్రమ రవాణా వెనుక ఉన్న వారిని అరెస్టు చేస్తామని ఎస్‌పి తెలిపారు.

నాలుగు టన్నుల పిడిఎస్ బియ్యం స్వాధీనం


ప్రజాశక్తి - జగ్గంపేట (కాకినాడ జిల్లా)

అక్రమంగా తరలిస్తున్న నాలుగు టన్నుల పిడిఎస్ బియ్యాన్ని కాకినాడ జిల్లా జగ్గంపేటలో విజిలెన్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సిఐ టి.నాగవెంకటరాజు తెలిపిన వివరాల మేరకు పిఠాపురం నుంచి జగ్గంపేట వైపు పిడిఎస్ బియ్యం అక్రమంగా రవాణా అవుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శనివారం తెల్లవారు జామున జగ్గంపేట మండలం రామవరం వద్ద ఎక్సైజ్ సిబ్బంది బియ్యం లోడుతో వెళుతున్న వ్యాన్‌ను పట్టుకున్నారు. తనిఖీలు చేయగా 4,059 కేజీల బియ్యం బస్తాలు లభ్యమయ్యాయి. వాహన డ్రైవర్ ఆళ్ల సత్యవెంకట శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. వ్యాన్ యజమాని లొల్ల లోవరాజుగా గుర్తించారు. వీరిరువురిపైన కేసు నమోదు చేశారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి బియ్యం బస్తాలను రామవరం స్టాక్ పాయింట్‌కు అప్పగించామని ఎంఎస్‌ఒ నాగబాబు తెలిపారు.

జిందాల్ బాధితులను కలిసేందుకు వెళ్తున్న
రైతు సంఘాల ప్రతినిధులను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

జిందాల్ కంపెనీకి భూములిచ్చి మోసపోయిన తమకు న్యాయం చేయాలని 112 రోజులుగా నిరసన తెలుపుతున్న బాధితులను కలిసేందుకు వచ్చిన రాష్ట్ర రైతుసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, రాష్ట్ర రైతు సంఘాల ప్రతినిధి, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహదేవ్, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు వర్మ, స్త్రీవిముక్తి సంఘం నాయకులు లక్ష్మిని పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్రంలో భూములు కోల్పోతున్న నిర్వాసితుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకు రైతుసంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన యాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్.కోట మండలం అడ్డతీగ గ్రామం వెళ్తుండగా, గ్రామ సమీపంలో నాయకులను సిఐ వి.నారాయణ ఆధ్వర్యాన పోలీసులు అడ్డుకున్నారు. గ్రామంలో పర్యటించేందుకు అనుమతి లేదని చెప్పారు. నాయకులను అడ్డుకున్న విషయం తెలుసుకొని బొడ్డవర నుంచి అడ్డతీగ వెళ్తున్న ఎమ్మెల్సీ రఘురాజును మార్గమధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. ఎస్‌పికి ఫోన్ చేసి ప్రశ్నించడంతో ఎమ్మెల్సీ రఘురాజును విడిచిపెట్టారు. మరోవైపు ఆందోళన చేస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లాజగన్ ఆధ్వర్యాన నిర్వాసితులంతా అడ్డతీగ వెళ్లేందుకు ప్రయత్నించగా రోప్ పార్టీతో అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరును నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. రైతు నాయకుల బృందం హోం శాఖ మంత్రికి ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా విడిచిపెట్టకపోవడంతో వెనుతిరిగారు.



పోలీసులు అడ్డుకోవడంలో రహదారి మధ్యలోనే మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఒకసారి నిర్వాసితులైన వారినే మరలా నిర్వాసితులను చేస్తున్నారు...

తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చి నిర్వాసితులైన రైతుల నుంచే మళ్లీ జిందాల్ కంపెనీకి భూములు తీసుకుని మళ్లీ నిర్వాసితులను చేశారని, ఇలా రెండుసార్లు నిర్వాసితులను చేయడం ఏ చట్టంలో ఉందో తెలపాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో భూములు కోల్పోతున్న నిర్వాసితుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన యాత్రలో భాగంగా జిందాల్ నిర్వాసితులను కలిసేందుకు వచ్చిన రాష్ట్ర రైతు బృందాన్ని పోలీసులు అడ్డుకోవడంపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణానికి అప్పుడు రిజర్వాయర్ గర్భంలో ఉన్న పాత అడ్డతీగ గ్రామ గిరిజనుల నుండి భూములు తీసుకొని కొత్త అడ్డతీగ, దెప్పూరు వద్ద భూములిచ్చారని, 2008లో జిందాల్ కంపెనీ కోసం ఈ భూములను కూడా తీసుకున్నారని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కంపెనీ కోసం భూములు తీసుకుని ఐదేళ్లలోపు కంపెనీలను నిర్మించుకుంటే ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలని చట్టంలో ఉందని తెలిపారు. రైతుల నుంచి కొన్న భూములకు ,జిందాల్ యాజమాన్యానికి ఎటువంటి సంబంధం లేదని ఈ భూములు పూర్తిగా రైతులవేనని చెప్పారు.

సంపాదకీయం


అణచివేత

సమకాలీన సమాజంలో పోలీసుల చుట్టూ అల్లుకుపోయిన కుల, మత, ప్రాంత, రాజకీయ సమస్యలతో పాటు అధికార్ల ఆగడాలనూ, ఉద్యోగ సమస్యలనూ, తన కళ్ల ముందే జరిగే అన్యాయాలనూ, కులవివక్షత, అణచివేతను ఎదిరించలేని ఒక పోలీసు అశక్తతను, ఆ వ్యవస్థలోని లోపాలను 'ఖాకీ బతుకులు' నవలలో సజీవంగా చిత్రించారు రచయిత మోహనరావు. సాధారణ పోలీసే కాదు- ఉన్నత పదవిలో వున్న వారు కూడా కుల వివక్షతను, అణచివేతను ఎదుర్కోక తప్పని పరిస్థితి. 'పోలీస్ వ్యవస్థలో బాసిజం, బానిసిజం-రెండూ నాటికీ, నేటికీ యథాతథంగానే వున్నాయి. కానిస్టేబుల్‌ను అఫిషియల్‌గా నెంబర్‌తోనూ, ప్రైవేటుగా అమర్యాదకరమైన బూతు పదాలతోనూ పిలిచే సంప్రదాయాన్ని పోలీసు అధికార్లు నియమబద్ధంగా పాటిస్తూనే వున్నారు' అంటారు చలసాని ప్రసాదరావు 1997లో రాసిన 'ఖాకీ బతుకులు' పుస్తక సమీక్షలో. దేశంలో నేటికీ వేళ్లూనుకొని వున్న కులవ్యవస్థ, పాలక వర్గ స్వభావానికి ఇది అద్దం పడుతోంది. ఐపిఎస్ అధికారిగా వుండి కూడా.. అణచివేతకు, వివక్షతకు గురవుతుంటే.. తన వ్యక్తిత్వానికి విరుద్ధంగా నడుచుకోలేక ఎంత హింస పడతాడో, ఎంత మానసిక సంఘర్షణకు గురౌతాడో హర్యానా ఐపిఎస్ అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్య బహిర్గతం చేసింది.

'యస్య శూద్రస్తు కురుతే రాజ్ఞో ధర్మ వివేచనమ్/ తస్య సీదతి తద్రాష్ట్రం పంకే గౌరివ పశ్యత' అంటుంది మనుస్మృతి. ఏ రాజ్యంలో ధర్మ వివేచన చేయు స్థానంలో శూద్రుడుంటాడో ఆ రాజ్యం, రాజు చూస్తుండగానే ఊబిలో దిగబడిపోయిన గోవులా నాశనమౌతుందని అర్థం. అంటే-శూద్రులు రాజ్యంలో పై స్థాయికి ఎదగరాదనేగా? నువ్వు ఐఎఎస్, ఐపిఎస్ అయినా, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అయినా, చివరకు ఈ దేశానికి రాష్ట్రపతి అయినా సరే.. కులం నిన్ను వెంటాడి హింసిస్తుంది మానసికంగా.. శారీరకంగా. పోలీసు వ్యవస్థ హైరార్కీలోనూ అణచివేత, వివక్షత వుంటుందని పలువురు విశ్లేషకులు వక్కాణించే మాట. తాజాగా దేశవ్యాప్త సంచలనంగా మారింది ఐపిఎస్ అధికారి పూరణ్ ఆత్మహత్య. ఉమ్మడి ఎ.పి కి చెందిన పూరణ్ కుమార్ 2001కి చెందిన ఐపిఎస్ అధికారి. ఛండీగఢ్‌లోని తన నివాసంలో ఈ నెల 7న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని చనిపోయారు. తనపై అణచివేత గురించి, కులం పేరుతో ఎదుర్కొన్న అవమానాల గురించి రాసిన సూసైడ్ నోట్‌లో 'బ్లేటెంట్ కాస్ట్ డిస్క్రిమినేషన్' వంటి పదాలు వాడటం ఆయన అనుభవించిన మానసిక వేదనను ధ్రువీకరిస్తాయి. 'బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హిందూత్వ, సనాతన ధర్మం పేరుతో దళితులు, గిరిజనులు, మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని, నిందితులపై చర్య తీసుకోడానికి బదులు వారికి రక్షణగా వుంటున్నారని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై షూ విసిరిన సంఘటనను కూడా గుర్తు చేస్తూ-న్యాయమూర్తులు కూడా సురక్షితంగా లేనప్పుడు సాధారణ పౌరుల పరిస్థితి ఏమిటి?' అంటూ పలు మౌలిక ప్రశ్నలు లేవనెత్తడం గమనార్హం. పూరణ్ భార్య అమ్నీత్ ఒక ఐఎఎస్ అధికారిణి. 'కుల అవమానాలు, అధిపత్య వేధింపులే తన భర్త మరణానికి దారితీశాయని, ఇద్దరు అధికారులు తన భర్తను ఏళ్లతరబడి టార్చర్ పెట్టారని, పోస్టుమార్టం నిర్వహించడంలో కూడా పోలీసులు తొందరపాటుగా వ్యవహరించారని, తన భర్త మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని' ఆమె డిమాండ్ చేస్తున్నారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడి, పూరణ్ ఆత్మహత్య... వేర్వేరు సంఘటనలు కావొచ్చు. కానీ, ఈ రెండిటిలోనూ ప్రధానాంశం కులం. 'సామాజిక సమానత్వంలేని రాజకీయ ప్రజాస్వామ్యం ఒక చిత్తు కాగితమే' అంటారు అంబేద్కర్. ఇదొక వ్యక్తి మరణం కాదు... వ్యవస్థాగత హత్య. దేశ లౌకిక విలువలపై ఇది బహిరంగ దాడి అని, రాష్ట్రపతి, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని పలు సంఘాలు, అభ్యుదయవాదులు డిమాండ్ చేస్తున్నారు. యజమానుల, అధికారుల ఆగడాలనూ, దోపిడీని మంచి మాటలతో మార్చలేమనీ, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనూ, హక్కులనూ పోరాడి సాధించుకోవాలే తప్ప ఇంకొక మార్గం లేదన్న నగ్నసత్యాన్ని క్రీస్తుపూర్వమే ఆచరణలో రుజువు చేశాడు రోమన్ బానిసల నాయకుడు స్పార్టకస్. 'అణచివేతకు గురౌతున్న కులంలో ఒక యజమాని తన నౌకరుని అణచివేస్తుంటే, నేను ఆ నౌకరువైపు నిలబడతాను' అంటారు పెరియార్. అణచివేత, కులవివక్ష ఏ రూపంలో వున్నా, ఏ స్థాయిలో వున్నా ఎదుర్కోవాలి.. పోరాటం చేయాలి. బాధితులకు అండగా అందరం నిలవాలి.

మహనీయుల మాట




ప్రకృతి రహస్యాలను వివరించలేనిది శాస్త్రం కాదు! జీవితంలోని కష్టాలను తీర్చలేనిది ఆవిష్కరణ కాదు!! జీవితంలోని ప్రతి కోణాన్ని చూపలేనిది సాహిత్యమే కాదు !!

- కొడవటిగంటి కుటుంబరావు, ప్రసిద్ధ రచయిత.

పాటలీపుత్రలో మరో మహా సంగ్రామం

ప్రస్తుతం



తెలకపల్లి రవి

నవంబరు 6, 11 తేదీలలో బీహార్ శాసనసభ ఎన్నికలు జరుగుతాయని, 14న ఫలితాలు వెలువడుతాయని ఎన్నికల సంఘం (ఇ.సి) ప్రకటించింది. చాలా కాలంగా దేశమంతా ఎదురు చూస్తున్న అతి కీలకమైన రాజకీయ సమరానికి రంగం సిద్ధమైంది. ప్రత్యేక ఓట్ల సవరణ (సర్) పేరిట ఎన్నికల సంఘం ఈ సమయంలోనే కొత్త ప్రహసనం ప్రారంభించడం దుమారం రేపింది. సుప్రీంకోర్టు కూడా అనేక విధాల సూచనలు చేసింది. ఎట్టకేలకు ఇ.సి సెప్టెంబరు 30న తుది జాబితా ప్రకటించింది. 63 లక్షల ఓట్లు తొలగిస్తే 23 లక్షల ఓట్లు చేర్చినట్టు ప్రకటించింది. ఇదిగాక మరో మూడు లక్షల ఓటర్లకు పైన అనర్హులుగా తొలగించింది. అయితే వారెవరూ ఎందుకు తొలగించబడ్డారనే దానిపై పారదర్శకత లేకుండా పోయింది. ఆఖరుకు సుప్రీంకోర్టు వారి పేర్లు వెల్లడించాలని కోరినా ఏవో మాటలతో కాలయాపన చేస్తున్న ఇ.సి ఇప్పుడు ఎన్నికల ప్రక్రియలోకి దిగిపోయింది. కాకుంటే అనేక దఫాలుగా ఎన్నికలు జరిపే సంప్రదాయం ఆపి ఒకటి రెండు దశల్లోనే ముగించాలని రాజకీయ పార్టీలన్నీ పట్టుపట్టడంతో ఎట్టకేలకు ఒప్పుకుంది. ఇక ఇప్పుడు ప్రధానమైన రెండు కూటములు ఎన్‌డిఎ, మహా ఘట్‌బంధన్ హోరాహోరీ పోరాటానికి సిద్ధమంటున్నాయి. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలతో పాటు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వంటి వారు కూడా పర్యటిస్తున్నారు. చెప్పాలంటే పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ స్పందన ఎలా వుంటుందా అని ప్రపంచమంతా చూస్తుంటే ఆయన బీహార్‌కు వెళ్లి 'నా నరాల్లో రక్తం కాదు, ఆగ్రహం ప్రవహిస్తున్నది' అనేట్టు మాట్లాడారు. ఎన్నికలు అక్టోబరులో వస్తాయి గనకే ఇంత హడావుడి పడ్డారని వేరే చెప్పాలా? మరికొన్ని గంటల్లో ఎన్నికల తేదీల ప్రకటన వెలువడుతుందనగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మెట్రో రైలును ప్రారంభించి ఏవో రాయితీలు ప్రకటించారు. ఒకప్పుడు మీకు ఎన్ని లక్షలు కావాలని ఊరించి ఉసూరనిపించిన మోడీ మహాశయుడు మరోసారి అదే తంతు నడిపించారు. ఏదో విధంగా బీహార్‌లో అధికారంలో కొనసాగకపోతే మిగిలిన చోట్ల కూడా దెబ్బ తింటామన్నది బిజెపి-ఆర్.ఎస్.ఎస్ భయం. దేశంలో మూడుసార్లు ఏదోలా అధికారంలోకి వచ్చినా వారికి కొరుకుడు పడని రాష్ట్రాలలో బీహార్ ఒకటి. అవకాశవాద ముఖ్యమంత్రి, జెడియు అధినేత నితీశ్ కుమార్ అటూ ఇటూ మారుతుండడాన్ని ఉపయోగించుకునే వారు మనుగడ సాగిస్తున్నారు. 2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ వచ్చిన ప్రభుత్వాలన్నిటినీ మూడుగా విభజించి చూపడం పరిపాటి. వంటరిగా నితీశ్ కుమార్, బిజెపితో కలసి విడిపోయిన, ఆర్.జె.డి తో కలసి విడిపోయిన దశలు. అయితే ఈ సారికి వచ్చేసరికి రాజకీయ నైతికత కోల్పోయిన ఆయనను ఇంటి దారి పట్టించేందుకు ప్రజలు, ప్రతిపక్ష 'ఇండియా' వేదిక, వామపక్షాలు రంగం సిద్ధం చేసుకునే వున్నాయి. బిజెపి కూడా ఈ క్రమంలో నితీశ్‌ను వెనక్కు నెట్టి తామే పెద్ద శక్తిగా కూర్చోవడానికి సిద్ధమైపోయారు కూడా. అయితే ఒంటరిగా పోరాడగలిగిన సత్తా, ధైర్యం కూడా బిజెపికి లేవు.



దేశంలో మూడుసార్లు ఏదోలా అధికారంలోకి వచ్చినా వారికి కొరుకుడు పడని రాష్ట్రాలలో బీహార్ ఒకటి. అవకాశవాద ముఖ్యమంత్రి, జెడియు అధినేత నితీశ్ కుమార్ అటూ ఇటూ మారుతుండడాన్ని ఉపయోగించుకునే వారు మనుగడ సాగిస్తున్నారు. 2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ వచ్చిన ప్రభుత్వాలన్నిటినీ మూడుగా విభజించి చూపడం పరిపాటి. వంటరిగా నితీశ్ కుమార్, బిజెపితో కలసి విడిపోయిన, ఆర్.జె.డి తో కలసి విడిపోయిన దశలు. అయితే ఈ సారికి వచ్చేసరికి రాజకీయ నైతికత కోల్పోయిన ఆయనను ఇంటి దారి పట్టించేందుకు ప్రజలు, ప్రతిపక్ష 'ఇండియా' వేదిక, వామపక్షాలు రంగం సిద్ధం చేసుకునే వున్నాయి. బిజెపి కూడా ఈ క్రమంలో నితీశ్‌ను వెనక్కు నెట్టి తామే పెద్ద శక్తిగా కూర్చోవడానికి సిద్ధమైపోయారు కూడా. అయితే ఒంటరిగా పోరాడగలిగిన సత్తా, ధైర్యం కూడా బిజెపికి లేవు.

నితీశ్‌కు ఎదురుగాలి

2020 శాసనసభ ఎన్నికల్లో ఆర్.జె.డి 75 స్థానాలతో అతి పెద్ద పార్టీగా వస్తే, బిజెపి 74 స్థానాలతో రెండవ స్థానంలో వచ్చింది. 44 తెచ్చుకున్న జెడియు మూడో స్థానంతో ఆగిపోయింది. పైగా ఆర్.జె.డి నాయకుడు లాలూ చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ ప్రజామోద నాయకుడుగా నిలబడి ఉపముఖ్యమంత్రి అయ్యారు. ఒప్పందం మేరకు మొదట ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ నితిశ్‌నే ముఖ్యమంత్రిని చేసినా తన ప్రాబల్యం తగ్గిపోవడం సహించలేకపోయారు నితీశ్. జాతీయ ప్రతిపక్ష కూటమి పేరిట అనేక విన్యాసాలు చేసినా చివరకు 2022లో మళ్లీ జట్టు మార్చి బిజెపితో కలిశారు. బిజెపి ఆయనను నామకార్థంగా కూర్చోబెట్టి చక్రం తిప్పుతున్నది. హిందూత్వ రాజకీయాలు సరేసరి. అయినా ముఖ్యమంత్రి పీఠమే పరమావధిగా భావించే నితీశ్ తల వంచి బతికేస్తున్నారు. గతంలోని నితీశ్‌కూ, ఇప్పటికి అసలు పోలికే లేదని అందరూ అంటున్న పరిస్థితి. మొన్న ప్రధానితో జరిగిన ఒక వీడియో కాన్ఫరెన్స్‌లో జరిగినంత సేపూ ముఖ్యమంత్రి చేతులు కట్టుకునే వుండటం ఆయన ఆరోగ్యంపై సందేహాలను పెంచింది. బహిరంగ సభల్లో ఐ.ఎ.ఎస్ లను వేడుకోవడం, కాళ్లు పట్టుకోవడం వంటి విపరీతాలను చూసి జనం విస్తుపోయిన సందర్భాలున్నాయి.

సామాజిక సమీకరణలు

బీహార్ ఎన్నికలలో కులం ప్రధాన పాత్ర వహిస్తుందని చెబుతుంటారు గానీ వాస్తవంలో అక్కడ పేదరికం, సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటం కూడా దాని వెనక వుంటాయని గమనించాలి. భూస్వామ్య పీడన దారుణంగా కొనసాగిన రాష్ట్రమది. ఆర్.జె.డి గత ఇరవై ఏళ్లలో మధ్యలో రెండుసార్లు రెండేళ్ల చొప్పున మాత్రమే అదీ భాగస్వామిగా వుండటం తప్ప ప్రతిపక్షంలోనే వుంది. స్వతహాగా ముస్లిం, యాదవ ఓటర్లు దానికి పునాదిగా వుంటారని భావిస్తారు. ఈసారి ముందే మేల్కొని కుష్వాహా, ధనుక్, మల్లా వంటి ఇతర వెనకబడిన కులాల వారిని కూడా తన వైపు తిప్పుకోవడానికి కేంద్రీకరించి పనిచేసింది. రాష్ట్ర పార్టీ అధ్యక్ష పదవి కూడా ఇచ్చింది. ఇదే తరహాలో కాంగ్రెస్, బి.ఎస్.పి లు జాతావులపై కేంద్రీకరించాయి. కొన్ని ప్రాంతాలలో దళితులలో సిపిఐ(ఎం.ఎల్) పార్టీ పట్టు కలిగి వుంది. ఇండియా వేదికలో వీరందరూ భాగస్వాములుగా వుండటం ఒకటైతే మిగిలిన చోట్ల వలెగాక ఇక్కడ ఆ కూటమి గట్టిగానే కొనసాగడం పరిస్థితిలో కీలకాంశంగా వుంటున్నది. సోషల్ ఇంజనీరింగ్ అనే ఈ బిసి, ఎస్‌సి కులాల సమీకరణ వ్యూహంతో సమిస్తిపూర్, దర్భంగా, మధుబని, కోశ్లీ, మిథిలాంచల్ వంటి చోట్ల కూడా ఆర్‌జెడి కూటమి పట్టు పెంచుకున్నట్టు అంచనాలు వేస్తున్నారు. దీనికే తేజస్వి 'మా బాప్ అలయన్స్' (ముస్లిం, యాదవ్, బహుజన, అగాధీ, అధీ అబది) అని పేరు పెట్టారు. అందువల్లనే పైకి ఏమి చెప్పినా తాము నితీశ్‌ను ముందుపెట్టుకుని పోవలసిందేనని బిజెపి నాయకులు బాహాటంగానే ఒప్పుకుంటున్నారు. మహిళా ఓటర్లలో ఆయనకు పట్టు ఎక్కువని వారి అంచనా. దానికి తగినట్టే ఎన్నికలు రాబోతున్న వేళ నితీశ్ మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ ప్రకటన చేయడం వారిని నిలబెట్టుకునే ప్రయత్నం మాత్రమే. అయితే ధరలు, అత్యాచారాలు, నిరుద్యోగ తీవ్రత మత రాజకీయాల కారణంగా అవి కాపాడలేకపోవచ్చు. 'సుశాసన్ బాబు' బిరుదు ధరించిన నితీశ్ హయాంలో ఏకంగా 18 వంతెనలే కొట్టుకుపోవడం కన్నా ఇందుకు మరో ఉదాహరణ అవసరం లేదు.

మోడీని ప్రధాని అభ్యర్థిగానే అంగీరించబోనని 2014లో బీరాలు పలికి కూటములు మార్చి పదవి కాపాడుకున్న నితీశ్ తర్వాత 2017లో ప్లేటు ఫిరాయించి వుండకపోతే బీహార్‌లోనే గాక దేశంలో కూడా రాజకీయాలు మరోలా వుండేవేమో. ఇదే 2022 లోనూ ఆయన పునరావృతం చేశారు. అందుకే ఆయనను 'పల్టు బాబు' అని బీహార్ ప్రజలు, నాయకులు అపహాస్యం చేస్తుంటారు. ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమ మనుగడ కోసం బిజెపిని మోయకపోతే మోడీ మూడోసారి ప్రధాని కాగలిగేవారు కాదనవచ్చు. కాకపోతే ప్రసుతం ఎ.పి లో వైసిపి, టిడిపి రెండూ బిజెపికి అనుకూలంగా వుంటే బీహార్‌లో మాత్రం లాలూ ప్రసాద్ యాదవ్ కుమారుడైన తేజస్వి యాదవ్ నితీశ్‌కు ప్రధాన సవాలుదారుగా ముందుకొచ్చారు. రాహుల్ గాంధీ కూడా దాదాపు అక్కడే పర్యటిస్తూ వచ్చారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అనవసరంగా పట్టు పట్టి అధిక స్థానాలు తీసుకుని ఓటమిపాలై వుండకపోతే నితీశ్ రాగలిగేవారు కాదు.

వామపక్షాల కీలక పాత్ర

ఉత్తర భారత దేశంలో నేరుగా బిజెపి పాలనకు చిక్కని ఈ ఏకైక రాష్ట్రాన్ని ఈసారైనా లౌకిక శక్తుల పాలనలోకి తీసుకురావడం కీలక కర్తవ్యంగా మారింది. బీహార్‌లో 'ఇండియా' వేదిక యథాతథంగా కొనసాగడానికి వామపక్షాల పాత్ర కూడా మరో ముఖ్య కారణం. చంద్రబాబు నాయుడు, కెసిఆర్, జగన్, నవీన్ పట్నాయక్ వంటి వారి వలె అవకాశవాద రాజకీయాలకు పగ్గాలు వేసి లౌకిక శక్తుల ఐక్యత కొనసాగించాలంటే వామపక్షాల పాత్ర వుండాలనే దానికి బీహార్ ఒక ప్రత్యేక ఉదాహరణ. సర్దుబాట్ల ఆలస్యం వల్ల కలిగే నష్టాన్ని నివారించేందుకు సిపిఎం ఇప్పటికే ఇద్దరు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. వామపక్షాలకు 2020లో కూడా 4.4 శాతం ఓట్లు వచ్చాయి. ఇందులో ఎం.ఎల్ పార్టీది ప్రధాన స్థానం కాగా వారి పెద్దన్న వైఖరి వామపక్ష ఐక్యత తగినంతగా పెరగకుండా ఆటంకం అవుతున్నదన్న వ్యాఖ్యానాలున్నాయి. లాలూ ప్రసాద్ యాదవ్ పాలనలో అవినీతి, ఏకపక్ష పోకడల వంటి ఆరోపణలు వున్నా బిజెపితో ఒకసారి కూడా పరోక్షంగానైనా చేయి కలపక పోవడం ప్రత్యేకతగా నిలిచింది.

పాట్నాతోనే పతనమా?

బిజెపి మత రాజకీయాలు, హిందూత్వ పోకడలు మైనార్టీలను దూరం చేస్తుండగా బీహార్‌లో ఆ అవకాశం మరింత ఎక్కువగా వుంది. ఇప్పుడు 'సర్' పేరిట ఎన్నికల సంఘం ద్వారా ఓట్ల అత్యవసర తనిఖీ చేపట్టడానికి కారణమదే. దొడ్డిదారిలో పౌరసత్వ సవరణ చట్టం వర్తింపచేసి లక్షలాది మైనార్టీ ఓట్లను తొలగించడం ద్వారా మొత్తం 90 స్థానాల్లో ఫలితాలు తారుమారు చేయొచ్చునేది ఒక కుటిల ఎత్తుగడ. 12 లక్షల మంది దాకా వలస కార్మికులు బీహార్ లోనే వున్నా స్థిరమైన ఇల్లు వంటివి వుండవు గనక అధికార పత్రాలన్నీ వుండకపోవచ్చు. వారందరినీ బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ ముస్లిం చొరబాటుదారులుగా చూపించి ఓట్లు తీసేయడం పెద్ద కుట్ర. మహారాష్ట్ర ఎన్నిక తరుణంలో చేసిన ఈ కుట్ర బీహార్‌లో ప్రప్రథమంగా ప్రారంభించారని ప్రతిపక్ష నాయకుడుగా రాహుల్ గాంధీ ముందే చేసిన ఓట్ చోరీ ఆరోపణ అంతర్జాతీయంగా ప్రచారమైంది. ఈ సమయంలో రెండు కూటములు కూడా ఇంకా సీట్ల సర్దుబాటు పూర్తి కాలేదు గానీ నితీశ్ ఏదో విధంగా ఒప్పేసుకోవడం అనివార్యం. ఇక ఆర్.జె.డి, కాంగ్రెస్ వేగంగా చర్చలు ముగించి వామపక్షాలనూ ఇతర చిన్న పార్టీలనూ కలుపుకొని పోవడానికి వాస్తవిక దృక్పథం తీసుకోవాలి. ఈ క్రమం మరీ ఆలస్యమైనా అవరోధాలు వచ్చినా నష్టం తప్పదు. చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి, జతిన్‌రాం మాంజీ 'హాం' (హిందుస్థానీ అవామ్ మోర్చా) పార్టీ కూడా తమ వాటా కోసం బేరాలు చేస్తున్నాయి. ఇక ఒవైసీ మజ్లిస్ ఓట్లను చీల్చడం గతంలో బిజెపికి లాభించింది. పైకి మోడీపై విమర్శలు గుప్పిస్తున్నా ఒవైసీ అదే పని చేస్తుంటారు. 'ఆప్' కూడా అభ్యర్థులను ప్రకటించింది. ఈసారి అదనంగా ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్ పార్టీ' రంగ ప్రవేశం చేసి ఇప్పటికే భారీగా అభ్యర్థులను ప్రకటించింది. ఇరుపక్షాల ఓట్లనూ చీలుస్తానని పి.కె హంగామా చేస్తుంటే మీడియా ఎక్కడ లేని ప్రచారమిస్తున్నది. ఆయన కూడా మతతత్వంపై ప్రత్యేక విమర్శ లేకుండా అందరి గురించి పైపైన ఏవో మాట్లాడుతూ గజిబిజి పెంచుతున్నారు. ఇవన్నీ ఎలా వున్నా నితీశ్ విధానాలతో, వైఫల్యాలతో, అవకాశవాదంతో విసిగిపోయిన బీహార్ ఓటర్లు ఖచ్చితంగా ఆయనను ఇంటికి పంపుతారని ఆశించవచ్చు. దేశ చరిత్రలో మొదటి నుంచి కీలక పాత్ర వహించిన పాట్నా అనబడే ఒకప్పటి పాటలీపుత్రం తాజా తీర్పు ఎలా వుంటుందో చూద్దాం. ఇప్పుడు కూడా మోడీ పతనం బీహార్‌లో మొదలవుతుందని సిపిఎం కార్యదర్శి ఎం.ఎ.బేబీ అక్కడ పర్యటించాక ప్రకటించడం గమనించదగ్గది.

★

ఈ సమయంలో రెండు కూటములు కూడా ఇంకా సీట్ల సర్దుబాటు పూర్తి కాలేదు గానీ నితీశ్ ఏదో విధంగా ఒప్పేసుకోవడం అనివార్యం. ఇక ఆర్.జె.డి, కాంగ్రెస్ వేగంగా చర్చలు ముగించి వామపక్షాలనూ ఇతర చిన్న పార్టీలనూ కలుపుకొని పోవడానికి వాస్తవిక దృక్పథం తీసుకోవాలి. ఈ క్రమం మరీ ఆలస్యమైనా అవరోధాలు వచ్చినా నష్టం తప్పదు. చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి, జతిన్‌రాం మాంజీ 'హాం' (హిందుస్థానీ అవామ్ మోర్చా) పార్టీ కూడా తమ వాటా కోసం బేరాలు చేస్తున్నాయి. ఇక ఒవైసీ మజ్లిస్ ఓట్లను చీల్చడం గతంలో బిజెపికి లాభించింది. పైకి మోడీపై విమర్శలు గుప్పిస్తున్నా ఒవైసీ అదే పని చేస్తుంటారు. 'ఆప్' కూడా అభ్యర్థులను ప్రకటించింది. ఈసారి అదనంగా ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్ పార్టీ' రంగ ప్రవేశం చేసి ఇప్పటికే భారీగా అభ్యర్థులను ప్రకటించింది. ఆయన కూడా మతతత్వంపై ప్రత్యేక విమర్శ లేకుండా అందరి గురించి పైపైన ఏవో మాట్లాడుతూ గజిబిజి పెంచుతున్నారు. ఇవన్నీ ఎలా వున్నా నితీశ్ విధానాలతో, వైఫల్యాలతో, అవకాశవాదంతో విసిగిపోయిన బీహార్ ఓటర్లు ఖచ్చితంగా ఆయనను ఇంటికి పంపుతారని ఆశించవచ్చు.

అర్థం చేసుకోకుండా చదివితే ఏమవుతుంది?

విశ్లేషణ

సి.వి.కృష్ణయ్య


అర్థం చేసుకోకుండా చదివితే ఏమవుతుంది? కొంప కొల్లేరవుతుంది. చేసిన కష్టమంతా వ్యర్థమవుతుంది.

వల్లెవేత చదువుల వల్ల ఎలాంటి ఫలితాలు వస్తున్నాయో చూస్తున్నాం గదా. ప్రపంచ దేశాల్లో మన స్థానం ఎక్కడ వుందో అర్థం కావడం లేదా? ఇప్పటివరకు మనకు వచ్చిన నోబెల్ అవార్డులు ఎన్ని? మనం ఎన్ని కొత్త ఆవిష్కరణలు చేశాము? ప్రతి ఏటా మనం సంపాదిస్తున్న పేటెంట్లు ఎన్ని? ప్రపంచ దేశాల్లో మన విశ్వవిద్యాలయాల స్థానం ఎక్కడ? చదువులు పూర్తి చేసుకుని బయటకు వచ్చే వారిలో నైపుణ్యంగలవారు ఎంతమంది? ఉత్తమమైన చదువుల కోసం విదేశాల్లో చదివే వారిలో భారతీయులు ఎంతమంది? అందుకోసం ఎన్ని లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు? నేరాలు, ఘోరాలు, మూఢ నమ్మకాలు ఇవన్నీ ఎందుకు పెరిగిపోతున్నాయి? విదేశాల్లో రాణిస్తున్న భారతీయులు స్వదేశాల్లో ఎందుకు రాణించడం లేదు? ఇలా చెప్పుకుంటూ పోతే, అర్థం లేని మన చదువుల వల్ల ఈ దేశం ఎంత నష్టపోతోందో తలచుకుంటే గుండెలు తరుక్కుపోతాయి. కాలాన్ని, వయస్సును, డబ్బును ఖర్చు చేసి మన పిల్లలు చదువుల పేరుతో చేస్తున్న కృషి బూడిదలో పోసిన పన్నీరవుతుంటే చూసి ఎలా తట్టుకోగలుగుతున్నాం? జరుగుతున్న నష్టం ఎంతో ఇప్పటికీ అర్థం కావడం లేదా?

అర్థం చేసుకోవడం అంటే....

నిజంగా అర్థం చేసుకోవడం ఎలా వుంటుందో ఒకసారి చూద్దాం. అర్థం చేసుకునేటప్పుడు మనసులో ఎలాంటి భావాలు కలుగుతాయో, సందేహాలు వస్తాయో, ఎలాంటి మార్పు కలుగుతుందో చూద్దాం. ఒక సైన్సు పాఠాన్ని ఉదాహరణగా తీసుకుందాం.

మొక్కల్లో కిరణ జన్య సంయోగ క్రియ ఎలా జరుగుతుందో తెలుసుకునే పాఠం పిల్లలు ఎలా అర్థం చేసుకుంటున్నారో, టీచరు ఏమి చేయాలో పరిశీలించి చూద్దాం. "మొక్కలు సూర్యుడి నుండి కాంతిని,



భూమి నుండి నీటిని, గాలి నుండి కార్బన్ డయాక్సైడ్‌ను తీసుకొని తమ ఆహారాన్ని తయారు చేసుకుంటాయి. ఈ సందర్భంగా జరిగే రసాయన చర్యల వల్ల మొక్కలు గాల్లోకి ఆక్సిజన్‌ను, నీటి ఆవిరిని విడుదల చేస్తాయి. దీన్నే కిరణజన్య సంయోగ క్రియ అంటారు. ఇది మొక్కల్లో ఆకుపచ్చని భాగంలోని హరిత కణంలో జరుగుతుంది". ఇదీ పాఠం.

ఈ పాఠం తొమ్మిదవ తరగతిలో వుందనుకుంటే ఇప్పటికే కింది తరగతిలో తెలిసి వుండాల్సిన విషయాలు చాలా వుంటాయి. తెలియకపోతే ఈ పాఠానికి ముందు ఈ కింది విషయాలన్నీ టీచరు తెలియజేయాలి. అప్పుడే పాఠం అర్థమవుతుంది. అవేమిటో చూద్దాం.

గాలి ఒక సమ్మేళనమని, అందులో కార్బన్ డయాక్సైడ్, ఆక్సిజన్, హైడ్రోజన్ వంటి మూలకాలతో పాటు చాలా వాయువులు వుంటాయని తెలిసి వుండాలి. ఆ మూడు వాయువుల ప్రయోజనాలు, వాటి గుణగణాలు తెలిసి వుండాలి. వాటిని ప్రయోగశాలలో చేసి చూడాలి. అలాగే సూక్ష్మదర్శిని సాయంతో ఆకులోని కణజాలం చూడాలి. సూర్యరశ్మి తగలకపోతే ఆ భాగాలు ఎలా తెల్లగా మారిపోతాయో ప్రయోగపూర్వకంగా మనం చూపించి వుండాలి. మొక్కలు నీళ్ళ ద్వారా నీటిని పీల్చుకుంటాయని ప్రయోగపూర్వకంగా తెలుసుకొని వుండాలి.

ఈ కొత్త విషయాలన్నీ తెలుసుకునేప్పుడు పిల్లల్లో ఎంతో ఆనందం, ఉత్సాహం పెల్లుబకడమే గాదు, ఎన్నో ఆలోచనలు కూడా వస్తాయి. సందేహాలు కలుగుతాయి. 'ఒక చిన్న ఆకులో ఇంత గొప్ప సంగతి వుందా' అని ఆశ్చర్యపోతారు. ఇదొక అద్భుతం అనుకుంటారు.

మొక్కల్లా జంతువులు, మనుషులు సూర్యరశ్మి సహాయంతో ఎందుకు ఆహారం తయారు చేసుకోవడం లేదు? మనిషి శరీరానికి సూర్యరశ్మి తగలకపోతే ఏమవుతుంది? స్వయంగా ఆహారం చేసుకునే ఆకులాంటి కృత్రిమ యంత్రాన్ని తయారు చేయవచ్చా? ఈ మొక్కలు లేకపోతే మనకు ఆక్సిజన్ దొరకదా? గాలిలో కార్బన్ డయాక్సైడ్ ఎక్కువైపోతుందా? అప్పుడు కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకొనే యంత్రాలు తయారు చేయవచ్చు కదా! ఆక్సిజన్ గాల్లోకి వదిలిపెట్టే యంత్రాలు తయారు చేయవచ్చు గదా! ఎందుకు చేయడం లేదు? ఈ విధంగా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు గదా! ఇలాంటి సృజనాత్మక ఆలోచనలన్నీ రావాలి.

అప్పుడు కొత్త కొత్త పేటెంట్లు వస్తాయి. చెట్ల పైన ప్రేమ, గౌరవం కలుగుతుంది. తనలో మార్పు వస్తుంది. పర్యావరణ స్పృహ పెరుగుతుంది. మొక్కలు పెంచాలనే దీక్షా, రక్షించాలనే పూనికా ఏర్పడతాయి. నిజంగా పాఠం అర్థమైతే ఇదంతా జరిగి తీరుతుంది.

మనం చేస్తున్నదేమిటి?

ఇప్పుడు మన క్లాస్‌రూమ్‌లో జరిగే చదువుల తతంగం చూద్దాం. పాఠాన్ని పిల్లలు చదవడం, ప్రశ్నించడం, చర్చించడం ఇలాంటివి ఏమీ వుండవు. పాఠాన్ని ఉపన్యాస పద్ధతిలో వివరించి టీచర్ ప్రశ్నలు, జవాబులు ఇస్తారు. పిల్లలు కంఠస్థం చేస్తారు. అర్థం చేసుకోవడం, ఆనందించడం, ప్రశ్నించడం, చర్చించడం అనే వాటికి తావే వుండదు. పాఠాన్ని ముక్కలు ముక్కలు చేసి, వాటిని గుర్తు పెట్టుకోవడానికి గొడ్డు చాకిరీ చేయించి, ఒత్తిడి పెంచి, పరీక్షలు పెట్టి, మార్కులు వేసి, ర్యాంకులు ఇచ్చి పిల్లల్ని భయపెట్టి, అవమానించి, ఉరికంబం ఎక్కిస్తాం. లేదా స్వయంగా ఏమాత్రం ఆలోచించలేని, చెప్పిన పని మాత్రమే చేసే మరబొమ్మల్ని చేస్తున్నాం. ఎలాగూ కృత్రిమ మేధ వచ్చింది. రోబోలు వచ్చాయి. ఇక రోబోలు తయారు చేసే మనుషులు కావాలి గానీ రోబోట్ల పని చేసే మనుషులెందుకు?

అసలు సమాచారాన్ని గుర్తుపెట్టుకొని రాయడం ఎందుకు? అది ఎలాగూ పుస్తకాలలో వుంది గదా! గూగుల్ లాంటి సమాచారం అందించే సైట్లు వున్నాయి గదా! దీనికంటే పుస్తకాలు చూసి పరీక్షలు రాసే పద్ధతి కొంత మేలు. కనీసం ఆ పాఠంలో జవాబులు ఎక్కడున్నాయో వెతికే శక్తి సామర్థ్యాలైనా వస్తాయి. కావలసింది సమాచారం గుర్తు పెట్టుకోవడం కాదు. స్పందన, మార్పు, కొత్త ఆలోచన, ఆ సమాచారానికి మరి కొత్తది జోడించగలిగే సృజనాత్మక ఆలోచన!

ఇప్పుడు మన క్లాస్‌రూమ్‌లో జరిగే చదువుల తతంగం చూద్దాం. పాఠాన్ని పిల్లలు చదవడం, ప్రశ్నించడం, చర్చించడం ఇలాంటివి ఏమీ వుండవు. పాఠాన్ని ఉపన్యాస పద్ధతిలో వివరించి టీచర్ ప్రశ్నలు, జవాబులు ఇస్తారు. పిల్లలు కంఠస్థం చేస్తారు. అర్థం చేసుకోవడం, ఆనందించడం, ప్రశ్నించడం, చర్చించడం అనే వాటికి తావే వుండదు. పాఠాన్ని ముక్కలు ముక్కలు చేసి, వాటిని గుర్తు పెట్టుకోవడానికి గొడ్డు చాకిరీ చేయించి, ఒత్తిడి పెంచి, పరీక్షలు పెట్టి, మార్కులు వేసి, ర్యాంకులు ఇచ్చి పిల్లల్ని భయపెట్టి, అవమానించి, ఉరికంబం ఎక్కిస్తాం. లేదా స్వయంగా ఏమాత్రం ఆలోచించలేని, చెప్పిన పని మాత్రమే చేసే మరబొమ్మల్ని చేస్తున్నాం.

స్పందన లేని చదువులెందుకు?

వేల సంవత్సరాల మానవజాతి ఒక్కో ఇటుక పేర్చుకుంటూ కట్టిన విజ్ఞాన సౌధంలో మనం నివసిస్తున్నామన్న సంగతిని పిల్లలు మరిచి పోకూడదు. పాఠంలోని సారాన్ని వదిలి, చెత్తని పిల్లల ముందు పడేస్తే అది తినలేక, మింగలేక వాళ్లు పడుతున్న బాధను ఎవరు అర్థం చేసుకుంటారు? ఏదైనా అర్థం కాకపోతే మళ్లీ అడుగుతాం. ఒక స్వీట్ లేదా హాట్ తింటాం, బాగుందో లేదో చెబుతాం. ఎంతో ఆసక్తిగా సినిమా చూస్తాం. ఆనందంగా పాటలు వింటాం. ఇష్టంగా కబుర్లు చెప్పుకుంటాం. ఏదో ఒక సంతృప్తి పొందుతాం. వేల సంవత్సరాలు ఎందరో మహానుభావులు జీవితాలు ధార పోసి కనుక్కున్న ప్రకృతి రహస్యాలు, విస్తుగొలిపే విషయాలు వింటున్నప్పుడు చదువుతున్నప్పుడు కూడా పిల్లల్లో ఎలాంటి స్పందనలు కలగలేదంటే వారికేమీ అర్థం కావడం లేదని మనం ఒప్పుకోవాలి గదా! ఇంత చిన్న విషయం కూడా మనం అర్థం చేసుకోలేకపోతున్నామంటే మనం కూడా ఆ చెట్టు కాయలమే అని సరిపెట్టుకుందామా? చివరిగా ఒక మాట పిల్లల్లో దేన్నైనా అర్థం చేసుకునే అపారమైన శక్తి సామర్థ్యాలున్నాయి. కనీసం వాటిని అలా వుంచనైనా వుంచకుండా చదువుల పేరుతో వాళ్ల బుర్రల్ని ఖాళీ చేస్తున్నాం గదూ.

తప్పు మనదే గానీ పిల్లలది కాదు గదూ!

/'జనవిజ్ఞానం' సౌజన్యంతో/

కవిత్వం

ఆడపిల్ల

నీ పుట్టుకకు
అంబరమే
సంబరపడుతుంటే
ఈ కుళ్ళు సమాజానికి
కలవరమెందుకు ?

నీ జన్మకి
పుడమితల్లే
పులకరిస్తుంటే
ఈ కుటిల వ్యవస్థకు
కంపరమెందుకు?

నీ పురిటి నొప్పులకి
ప్రకృతి మాతే
పరవశిస్తుంటే
ఈ కుత్సిత సంఘానికి
బెంగ ఎందుకు?

నీవు లేనిదే
మానవ జాతి
సృష్టే లేదని
నిత్యం పుడుతూ
ఈ జనానికి
కనువిప్పు కల్గించూ....

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్: 7780277240

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @ gmail.com

మేము బతికే ఉన్నాం

- పేర్ల తొలగింపుపై ఎన్నికల అధికారులకు బీహార్ గ్రామస్తుల మొర

పాట్నా : త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఎస్ఐఆర్ పేరుతో తమ పేర్లు తొలగించారంటూ పలువురు ఓటర్లు ఇప్పటికీ ఎన్నికల సంఘం అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. ఇటీవల ఇసి వెల్లడించిన ఓటరు జాబితాలో తాము మరణించినట్లుగా చూపడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తాము బతికే ఉన్నామంటూ ఎన్నికల అధికారులకు తెలియజేశారు. ధోరైయా బ్లాక్‌లోని బట్సర్ గ్రామానికి చెందిన ఐదుగురు నివాసితులు మరణించినట్లుగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్కొన్నారు. ఇది చూసి ఆ గ్రామస్తులు ఆశ్చర్యపోయారు. గ్రామంలోని బూత్ నంబర్ 216 నివాసితులైన మోహన్ సా, సంజయ్ యాదవ్, రాంరూప్ యాదవ్, నరేంద్ర కుమార్ దాస్, విశ్వవర్ ప్రసాద్ కలిసి బిడిఒ అరవింద్‌ను శుక్రవారం కలిశారు. తాము బతికే ఉన్నామని, ఓటరు జాబితాలో తమ పేర్లు చేర్చాలంటూ వినతిపత్రం అందజేశారు. వారి ఫిర్యాదుపై బిడిఒ అరవింద్ స్పందించారు. ఫారం-6 నింపి వారి పేర్లను తిరిగి ఓటరుగా నమోదు చేయాలని బిఎల్‌ఒకు సూచించారు.

బిజెపి దళిత వ్యతిరేకి

- ఎమ్మెల్యే మిశ్రిలాల్ యాదవ్ రాజీనామా

పాట్నా : బిజెపి దళిత వ్యతిరేకి అని బిజెపి ఎమ్మెల్యే మిశ్రి లాల్ యాదవ్ అన్నారు. ఆ పార్టీకి తాను రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. దర్భాంగా జిల్లాలోని అలీనగర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్‌కు రాజీనామా సమర్పిస్తానని చెప్పారు. చాలా ఏళ్ల నుంచి కండబలం, ధనబలం ఉన్న వారు కూడా అలీనగర్ స్థానంలో గెలవలేకపోయారని, మొదటిసారి ఎన్‌డిఎ తరపున 2020లో తాను గెలిచానని అన్నారు. వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (విఐపి) తరపున గెలిచిన ఆయన ఆ తరువాత బిజెపిలో చేరిపోయారు. సింగర్ మైథిలీ ఠాకూర్‌కు అలీనగర్ సీటు ఇస్తారన్న ప్రచారం నేపథ్యంలోనే మిశ్రి రాజీనామా ప్రకటించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

32 మందితో ఎంఐఎం జాబితా

పాట్నా : పొత్తు కోసం ఆర్‌జెడి నేతలు లాలూప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌లకు లేఖ రాసినా సమాధానం లేకపోవడంతో 32 మందితో జాబితాను ఎఐఎంఐఎం విడుదల చేసింది. వంద స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించామని ఆ పార్టీ బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అఖ్తరుల్ ఇమాన్ చెప్పారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఐదు స్థానాల్లో గెలవగా, వారిలో నలుగురు ఎమ్మెల్యేలు ఆర్‌జెడిలో చేరారు.

కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలను కలవనున్న విజయ్

చెన్నై : కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది కుటుంబ సభ్యులను టివికె అధినేత విజయ్ ఆదివారం కలవనున్నారు. ఇంటింటికీ వెళ్లి కాకుండా అందరినీ దర్మపురి జిల్లాలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక వేదికపై విజయ్ కలవనున్నట్లు టివికె పార్టీ శనివారం ప్రకటించింది. దీనికోసం ధర్మపురి జిల్లాలో ప్రత్యేక వేదికను సిద్ధం చేస్తున్నారు. టివికె విజ్ఞప్తి మేరకు డిఎంకె ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేస్తోంది.

వికలాంగ విద్యార్థినిపై అత్యాచారం

- కోల్‌కతాలో ఘటన

కోల్‌కతా : పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరిగిన ఘటన నుంచి తేరుకోకముందే ఇంకో ఘోరం చోటుచేసుకుంది. రాజధాని కోల్‌కతాలో వికలాంగురాలిపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. శుక్రవారం రాత్రి పోర్ట్ డివిజన్లోని నైదాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం ఉదయం నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు.

విద్వేషానికి శాంతి బహుమతా ?

- మచాడోకు నోబెల్‌పై విమర్శలు

కారకాస్ : నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని 2025వ సంవత్సరానికి గాను వెనిజులాకు చెందిన మరియా కొరినా మచాడోకు ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా మద్దతుతో హింసా రాజకీయాలను ప్రోత్సహించి, మద్దతు తెలిపిన మచాడోకు శాంతి బహుమతి ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. వెనిజులా ప్రజల ప్రియతమ నాయకుడు హ్యూగో చావేజ్‌ను 2002లో అధ్యక్ష పదవి నుండి తప్పించిన తిరుగుబాటు కుట్రలో ఈమె భాగస్వామి. అంతేకాదు జాతీయ అసెంబ్లీని, సుప్రీం కోర్టును, దేశ రాజ్యాంగాన్ని రద్దు చేసే బిల్లుపై (కార్మోనా డిక్రీ) మచాడో సంతకం చేశారు. అనంతరం అధికారాన్ని హస్తగతం చేసుకుని వ్యాపార వేత్త పెడ్రో కార్మోనారె తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించారు. ఇది ప్రజల్లో ఆగ్రహ జ్వాలను రేకెత్తించింది. ప్రజలు రోడ్లపైకి వచ్చి నిర్బంధంలో ఉన్న చావేజ్‌ను విడిపించారు. 47 గంటల్లోనే అమెరికా కుట్రలను త్రిప్పి కొట్టారు. తిరుగుబాటు విఫలమైన తరువాత ఆమెపై రాజద్రోహ నేరానికి 28 సంవత్సరాల జైలు శిక్షను సుప్రీం కోర్టు విధించింది. చావేజ్ క్షమాభిక్ష పెట్టడంతో మచాడో జైలు శిక్ష తప్పించుకున్నారు. తరువాత 2005లో అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ తన కార్యాలయానికి పిలిపించుకుని చర్చించడం అప్పట్లో సంచలనం కలిగించింది. దీంతో ఈ కుట్ర వెనకాల అమెరికా హస్తం ఉందని స్పష్టమైంది.

ఎవరీ మచాడో ?

వెనిజులాలో హ్యూగో చావేజ్ నాయకత్వంలో సైమన్ బొలివేరియన్ విప్లవం జరిగింది. అనంతరం అధ్యక్షుడైన చావేజ్ దేశ ప్రయోజనాల కోసం ఉక్కు గనులను, చమురు రంగాన్ని స్వాధీనం చేసుకుని, జాతీయం చేశారు. దీంతో అమెరికా ఆధిపత్యానికి, దేశంలోని బడా వ్యాపారుల దోపిడీకి తీవ్ర ఆటంకం కలిగింది. ఆ ఉక్కు వ్యాపారుల కుటుంబం నుండి వచ్చిన పెట్టుబడిదారి పుత్రికే ఈ మరియా కొరినా మచాడో. కారకాస్‌లో 1967లో జన్మించిన మచాడో అమెరికా, వ్యాపారస్తుల ప్రయోజనాల కోసం పని చేసే సమాటూ సంస్థను స్థాపించిన వారిలో ఒకరు. 2002 నుండి రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. బహిరంగంగానే చావేజ్‌ను, ప్రస్తుత అధ్యక్షుడు మదురోను విమర్శిస్తూ, అమెరికాను సమర్థిస్తున్నారు. ప్రైవేటీకరణ, విదేశీ కంపెనీలకు వనరులను సమకూర్చడం వంటి నియోలిబరల్ విధానాలను ప్రచారం చేస్తున్నారు.. 2014లో దేశంలో బస్సులను, ప్రభుత్వ కార్యాలయాలను తగలబెట్టడం, పౌరుల సజీవదహనం వంటి హింసాత్మక ఘటనల్లో ఆమె ప్రత్యక్షంగా పాల్గొని నాయకత్వం వహించారు. అదే సంవత్సరం అమెరికా ఆహ్వానం మేరకు ది ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ (ఒఎఎస్) సదస్సుకు హాజరై ఆ వేదిక నుండి వెనిజులాపై తీవ్ర విమర్శలు చేసి, ప్రభుత్వాన్ని మార్చాలని పిలుపునిచ్చారు. 2018లో వెనిజులాలో పాలన మార్పు కోసం మద్దతు కోరుతూ ఇజ్రాయిల్, అర్జెంటీనాలకు లేఖ రాసి దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.


2005లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యు బుష్‌తో వైట్‌హౌస్‌లో కరచాలనం చేస్తున్న మరియా కొరినా మచాడో

నరహంతక ఇజ్రాయిల్‌కు మద్దతు..

గాజాలో నరమేధం సృష్టిస్తున్న ఇజ్రాయిల్‌ను ప్రపంచంలోని అనేక దేశాలు ఈసడించుకుంటుంటే, మచాడో నెతన్యాహును సమర్థించారు. ఇజ్రాయిల్‌ను స్వేచ్ఛకు నిజమైన మిత్రుడు అని అభివర్ణించడం కొసమెరుపు.

తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తమ దేశ రాయబార కార్యాలయాన్ని టెల్ అవీవ్ నుండి జెరుసలేంకు తరలిస్తానని ఆమె ప్రకటించారు. 2020లో నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీతో సహకార ఒప్పందం చేసుకున్నారు. తమ దేశంలో జోక్యం చేసుకుని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని పడగొట్టాలని అభ్యర్థించారు. ఇది వెనిజులా సార్వభౌమాధికారాన్ని, స్వతంత్రతను దెబ్బతీస్తుందని, ప్రత్యక్షంగా విదేశీ సైనిక జోక్యాన్ని ఆహ్వానించడమేనని వెనిజులా దేశాధ్యక్షుడుతో సహా పలువురు విమర్శించారు. మరోవైపు వాషింగ్టన్‌తో అంటకాగుతూ దేశంలో కార్పోరేట్ ప్రయోజనాల కోసం పని చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అమెరికా ప్రభుత్వం కఠిన ఆర్థిక ఆంక్షలు వెనిజులాపై విధించి దేశాన్ని అస్థిర పరుస్తుంటే ఏనాడూ మచాడో అమెరికాను విమర్శించలేదు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా పేరుతో అమెరికా సైన్యం దేశ సరిహద్దులోని సముద్రతీరంలో అమాయకులైన మత్స్యకారులను చంపుతున్నా, ఆమె ఖండించలేదు.

మనస్సాక్షి లేని నిర్ణయం : అమెరికా, ఇస్లామిక్ సంబంధాల మండలి

మచుడోకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటించడంపై అమెరికా, ఇస్లామిక్ సంబంధాల మండలి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది మనస్సాక్షి లేని నిర్ణయమని, పున:పరిశీలించాలని కోరుతూ శనివారం ప్రకటన విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా శాంతి కోసం పని చేసిన వారిని నోబెల్ కమిటీ పక్కనపెట్టిందని పలువురు విమర్శిస్తున్నారు. గాజాలో అనేక మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని, పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బెర్గ్ వంటి వారిని పరిగణలోకి తీసుకోలేదని వారు పేర్కొన్నారు.

బ్యాంకుల్లో ప్రైవేటు వ్యక్తుల నియామక మార్గదర్శకాలు ఉపసంహరించుకోవాలి

- ఈ తిరోగమన చర్యను వ్యతిరేకించాలి
- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రైవేటు వ్యక్తుల నియామక మార్గదర్శకాలు ఉపసంహరించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. కేబినెట్ కమిటీ నియామకాల సవరించిన మార్గదర్శకాలను ఖండించింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి), నాన్ - లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల్లో నిర్వహణ స్థానాల్లో ప్రైవేటు వ్యక్తుల నియామకానికి కేంద్ర మంత్రివర్గం ఈ నెల 4న సవరించిన మార్గదర్శకాలను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి కేంద్ర ప్రభుత్వం దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని, ఈ జాతీయ సంస్థల ప్రజా స్వభావాన్ని నిలబెట్టాలని సిఐటియు కోరుతోందని అన్నారు.

ఈ మార్గదర్శకాలు దశాబ్దాలుగా దేశ ప్రజల ఆర్థిక వ్యవస్థతో నిర్మించిన ప్రభుత్వ ఆర్థిక సంస్థల భద్రత, సమగ్రతకు కలిగించే తీవ్రమైన ముప్పు గురించి సిఐటియు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుందని పేర్కొన్నారు. కేబినెట్ కమిటీ ఏకీకృత మార్గదర్శకాలతో ప్రైవేటు రంగ ఎగ్జిక్యూటివ్‌లను మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, హోల్‌టైమ్ డైరెక్టర్, ఛైర్‌పర్సన్ పదవులకు పరిగణించడానికి అనుమతించడం పార్లమెంటు రాజ్యాంగ అధికారాలను తీవ్రంగా ఉల్లంఘించే మార్గమేనని అన్నారు. జాతీయ ప్రయోజనాలను, ప్రజలను ఫణంగా పెట్టి ప్రైవేటు కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలకు ప్రముఖ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి, ఉపయోగించుకోవడానికి మార్గం సుగమం చేస్తుందని విమర్శించింది.

ఈ ప్రభుత్వరంగ ఆర్థిక సంస్థలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం-1955తో ప్రజల సార్వభౌమ సంకల్పాన్ని వినియోగించి పార్లమెంట్ రూపొందించిన చట్టాలతో స్థాపించిన చట్టబద్ధమైన సంస్థలని పేర్కొన్నారు. బ్యాంకింగ్ కంపెనీల చట్టాలు-1970, 1980, ఎల్ఐసి చట్టం-1956లో ఉన్నత పదవులకు నియామకాలను ఏర్పాటు చేసే పద్ధతులు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ పారదర్శక జవాబుదారీ ప్రభుత్వ నియామక ప్రక్రియను రద్దు చేస్తే, ప్రైవేట్ వ్యక్తులు / రంగానికి అనుకూలంగా ఉంటాయని అన్నారు.

ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు చేసిన పోరాట ఉద్యమం కారణంగా నిరాశ చెందిన మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు రంగానికి ఉన్నత పదవులను ఇవ్వడానికి ఈ ప్రమాదకరమైన, తిరోగమన చర్యతో ముందుకొచ్చిందని విమర్శించారు. నయా ఉదారవాద విధానాలకు అనుగుణంగా దేశీయ, విదేశీ కార్పొరేట్‌లకు ప్రయోజనం చేకూర్చడానికి బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల విధ్వంసక దేశ వ్యతిరేక ప్రయత్నాన్ని ఇది స్పష్టం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల రక్షణకు ఈ సవరించిన ఏకీకృత మార్గదర్శకాలను వ్యతిరేకించే ఉద్యోగులకు సిఐటియు తన మద్దతు, సంఘీభావాన్ని తెలియజేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ తిరోగమన చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని కార్మికవర్గ ఉద్యమానికి సిఐటియు పిలుపునిస్తుందన్నారు.

పాక్‌లో ఉగ్ర దాడి

- ఏడుగురు పోలీసులు, ఆరుగురు ఉగ్రవాదులు మృతి

డేరా : పాకిస్థాన్‌లోని పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని పోలీస్ శిక్షణా కేంద్రంపై శనివారం జరిగిన ఉగ్రదాడిలో ఏడుగురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ వజీరిస్తాన్ సరిహద్దుకు సమీపంలోని డిఐ ఖాన్ జిల్లాలోని డేరా ఇస్మాయిల్ ఖాన్ పోలీస్ శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం అర్ధరాత్రి సమయంలో తెహ్రిక్ - ఇ - తాలిబన్ పాకిస్తాన్ (టిటిపి)కి చెందిన ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో కూడిన ట్రక్కుతో ఢీకొట్టారు. దీంతో, భారీ పేలుడు సంభవించినట్లు సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దాడిలో ఒకరు మరణించగా, ఉగ్రవాదులతో జరిగిన కాల్పుల్లో మరో ఆరుగురు పోలీసులు మరణించారు. ఆ తరువాత ఆరుగురు ఉగ్రవాదులను హతమార్చినట్లు సైన్యం పేర్కొంది. ఈ ఘటన జరిగిన సమయంలో శిక్షణకు వచ్చిన వారు, సిబ్బంది 200 మంది వరకూ ఉన్నట్లు వివరించింది.

అమెరికా షట్‌డౌన్ ఎఫెక్ట్! సిడిసి ఉద్యోగులకు లే ఆఫ్ నోటీసులు

వాషింగ్టన్ : అమెరికా షట్‌డౌన్ ఎఫెక్ట్ మొదలైంది. అనవసరపు ఉద్యోగులు పేరుతో పలు విభాగాలు, శాఖల నుండి సిబ్బందిని తొలగించడం ప్రారంభమైంది. ఇప్పటికే వందలు వేల సంఖ్యలో ఫెడరల్ వర్కర్లను ఇళ్లకు పంపారు. బాధిత విభాగాల్లో సిడిసి (సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్) సహా ఆరోగ్యం, మానవ సేవల విభాగం వుంది. తాజా కోతల్లో భాగంగా సిడిసికి చెందిన ఉద్యోగులను డజన్ల సంఖ్యలో ఇంటికి పంపించారని న్యూయార్క్ టైమ్స్ శనివారం పేర్కొంది. ఉద్యోగాలు కోల్పోయిన వారిలో వ్యాధి నిర్ధారకులు (డిసీజ్ డిటెక్టివ్స్), ఉన్నత స్థాయి శాస్త్రవేత్తలు సహా మొత్తంగా వాషింగ్టన్ కార్యాలయం వుందని పత్రిక పేర్కొంది. దీనిపై వైట్‌హౌస్ కానీ, సిడిసి అధికారులు గానీ తక్షణమే స్పందించలేదు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో తొలగించే ఉద్యోగులందరికీ లే ఆఫ్ నోటీసులను ఇ మెయిల్ ద్వారా పంపారు. వారి విధులు లేదా బాధ్యతలను ప్రస్తుతానికి అనవసరమైనవిగా లేదా ఒకే రకమైన పనిని ఇతర చోట్ల కూడా చేస్తున్నారని భావిస్తున్నట్లు తెలియజేశారు. సిడిసి వర్కర్లలో ఎంతమందిని తొలగించారన్నది ధ్రువీకరించలేదని



న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. షట్ డౌన్ ప్రకటించి నేటితో 11 రోజులవుతున్నా సెనెట్‌లో బిల్లు ఆమోదం పొందలేదు.

నష్టపోతున్న ఉద్యోగులు

రిపబ్లికన్లు, డెమొక్రట్ల మధ్య పోరులో లక్షలాది మంది ఉద్యోగులు నష్టపోతున్నారు. గత షట్‌డౌన్ కాలంలో తాత్కాలికంగా తొలగించినా తిరిగి ఉద్యోగాలు ఇచ్చారని, జెడి వాన్స్ వంటి ప్రముఖు లు ఇప్పుడు అటువంటి పరిస్థితులు లేవని ప్రకటించడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతు న్నారు. అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ యూనియన్, ఫెడరల్ కార్మిక సంఘా లు సామూహిక తొలగింపులు ఆపాలని కాలిఫోర్ని యా కోర్టులో దావా వేశాయి. న్యాయమూర్తి సుసాన్ ఇల్‌స్టన్ తొలగింపులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేశారు.

బెంగాల్‌లో మరో ఘోరం

(మొదటిపేజి తరువాయి)

అక్కడ నుండి పారిపోయినందున అతడి ప్రమేయం కూడా వుందని అనుమానిస్తున్నామని బాధితురాలి కుటుంబం తెలిపింది. ఆ స్నేహితుడు తన కుమార్తెను తప్పుదారి పట్టించాడని, ఆమెను ఖాళీగా వున్న ప్రదేశానికి తీసుకెళ్లాడని బాధితురాలి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలి : సిపిఎం, ప్రజాసంఘాల ఆందోళన

ఘటన గురించి తెలుసుకున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు బాధితురాలిని పరామర్శించారు. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దుర్గాపూర్‌లోని పోలీసు స్టేషన్ వద్ద పెద్దఎత్తున ఆందోళన చేశారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ దుర్గాపూర్‌లో మహిళలు ర్యాలీ నిర్వహించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి : ఎహెచ్‌ఎస్‌డి

అత్యాచారానికి పాల్పడిన వారందరినీ వెంటనే అరెస్టు చేయాలని అసోసియేషన్ ఆఫ్ హెల్త్ సర్వీస్ డాక్టర్స్ (ఎహెచ్‌ఎస్‌డి) డిమాండ్ చేసింది. ఈ ఘటన వైద్య సంస్థల్లో, సమీప ప్రాంతాల్లో భద్రతా లోపాలను మరోసారి బట్టబయలు చేసిందని విమర్శించింది. విధుల్లో ఉన్న లేదా పదవీ విరమణ చేసిన న్యాయమూర్తి నేతృత్వంలో న్యాయ విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. పారదర్శకమైన, వేగవంతమైన, నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించాలని, డిమాండ్ చేసింది. బాధితురాలికి న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైద్యులు, ఆరోగ్యకర్తలు ఆందోళన ప్రారంభిస్తామని హెచ్చరించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి లేఖ రాసింది.


దుర్గాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఖండించిన జాతీయ మహిళా కమిషన్, ఒరిస్సా సిఎం

బాధితురాలిని, ఆమె తల్లిదండ్రులను కలుసుకోవడానికి జాతీయ మహిళా కమిషన్ బృందం దుర్గాపూర్ వెళ్లింది. ఈ సందర్భంగా ఎన్‌సిడబ్ల్యు సభ్యురాలు అర్చనా మజుందార్ మాట్లాడుతూ, బెంగాల్‌లో మహిళలపై నేరాలను అరికట్టడానికి సిఎం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనను ఒరిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి తీవ్రంగా ఖండించారు. బాధ్యులను గుర్తించి తక్షణమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. బాధితురాలి కుటుంబానికి అవసరమె న సాయం అందజేస్తామన్నారు.

నివేదిక కోరిన ప్రభుత్వం

దుర్గాపూర్‌లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యం నుండి ఈ ఘటనపై నివేదికను రాష్ట్ర ఆరోగ్య శాఖ కోరింది. ఈ సంఘటనపై తక్షణమే నివేదికను అందించాలని కోరామని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. బాధితురాలికి వైద్య చికిత్సతోపాటూ మానసికంగా కౌన్సెలింగ్ అందజేస్తున్నట్లు పశ్చిమ బెంగాల్ మహిళా శిశు సంక్షేమ మంత్రి శశి పంజా చెప్పారు.

కొరవడుతున్న భద్రత

పశ్చిమ బెంగాల్‌లో మహిళలకు భద్రత కొరవడడంపై సర్వత్రా విమర్శలు, ఖండనలు వెల్లువెత్తుతున్నాయి. కోల్‌కతాలోని కాలేజీ కేంపస్‌ల్లోనే అత్యాచారాలు చోటు చేసుకోవడం మరింత ఆందోళనను కలిగిస్తోంది. జులైలో లా విద్యార్థినిపై దక్షిణ కలకత్తా లా కాలేజీ ఆవరణలోనే సామూహిక అత్యాచారం జరిగింది. రాజకీయాలతో సంబంధాలున్న మాజీ విద్యార్థిని, మరో ఇద్దరు విద్యార్థులను, సెక్యూరిటీ గార్డును ఈ ఘటనలో అరెస్టు చేశారు. గత ఏడాది ఆగస్టులో ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీలో రాత్రి పూట విధుల్లో వున్న మహిళా ట్రెయినీ డాక్టరుపై అత్యాచారం, హత్య జరిగింది. ఆ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఈ కేసులో సివిక్ పోలీసు వలంటీర్ సంజయ్ రాయ్‌కు యావజ్జీవ శిక్ష పడింది. అసలు నిందితులను విడిచిపెట్టారంటూ ఇప్పటికీ ఆమె కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తూనే ఉన్నారు.


ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రీ మెద్వదేవ్ కరచాలనం

కొత్త అణు క్షిపణిని ప్రదర్శించిన ఉత్తర కొరియా

సియోల్ : కొత్త ఖండాంతర బాలిస్టిక్ అణు క్షిపణి (ఐసిబిఎం)ని ఉత్తర కొరియా ప్రదర్శించింది. అత్యంత శక్తివంతమైన ఆయుధాలతో పెద్ద ఎత్తున సాగిన మిలటరీ పరేడ్‌లో దీన్ని ప్రదర్శించారు. ఈ క్షిపణికి హాసంగ్-20గా పేరు పెట్టారు. రాబోయే వారాల్లో ఈ క్షిపణిని పరీక్షించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అత్యంత శక్తివంతమైన అణు వ్యూహాత్మక ఆయుధ వ్యవస్థగా ఉత్తర కొరియా దీన్ని అభివర్ణిస్తోంది.

ఉత్తర కొరియా పాలక వర్కర్స్ పార్టీ 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్యాంగాంగ్ మెయిన్ స్క్వేర్ వద్ద శుక్రవారం ప్రారంభమైన ఈ పరేడ్‌కు పలువురు విదేశీ నేతలు హాజరయ్యారు. శత్రు దేశాలను లక్ష్యంగా చేసుకోగల ఆయుధాలను సమకూర్చుకోవడానికి ఉత్తర కొరియా చేస్తున్న నిరంతర కృషికి ఈ పరేడ్ నిలువుటద్దం పట్టింది. పరేడ్‌లో కొత్త ట్యాంకులను, శతఘ్ని వ్యవస్థలను, డ్రోన్లను ప్రదర్శించారు. అన్ని సవాళ్లనూ ఎదుర్కొని అజేయంగా ఎదగడానికి తమ మిలటరీ కృషి చేస్తోందని ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ పేర్కొన్నారు. చైనా, వియత్నాం, రష్యా నేతలు, అధికారులతో కలిసి పోడియం వద్ద ఆయన మాట్లాడారు.

మహిళా జర్నలిస్టులను ఎందుకు మినహాయించారు?

- ఆఫ్ఘన్ మంత్రితో సమావేశంపై విమర్శల వెల్లువ
- తమ ప్రమేయం లేదన్న విదేశాంగశాఖ

న్యూఢిల్లీ : ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి ఆమిర్‌ఖాన్ ముత్తాఖీ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశానికి మహిళా జర్నలిస్టులను పిలవకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. తాలిబన్ పాలనలో ఉన్న ఆఫ్ఘన్‌లో మాదిరిగానే... ఇక్కడా మహిళలు పాల్గొనకుండా నిషేధం విధించారని, ఇందుకు మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం సహకారం అందించిందంటూ పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. 'ఆఫ్ఘన్ మంత్రి పర్యటన వేళ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశానికి భారత్‌లోని ఆఫ్ఘనిస్తాన్ రాయబార కార్యాలయం ఎంపిక చేసిన జర్నలిస్టులకు ఆహ్వానం అందింది. ఈ రాయబార కార్యాలయం భారత ప్రభుత్వ అధికార పరిధిలోకి రాదు' అని కేంద్రం వెల్లడించింది. ఢిల్లీలోని ఆఫ్ఘనిస్తాన్ ఎంబసీలో ముత్తాఖీ శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఒక్క మహిళ కూడా కనిపించలేదు. మహిళా జర్నలిస్టులు పాల్గొనకుండా అడ్డుకున్నారని వార్తలొచ్చాయి. ఇదే విషయాన్ని వెల్లడిస్తూ కొందరు మహిళా పాత్రికేయులు సోషల్ మీడియా ద్వారా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ స్పందించారు. 'మహిళా జర్నలిస్టులు పాల్గొనకుండా అడ్డుకునేందుకు అనుమతించడం ద్వారా.. మీరు వారికోసం నిలబడలేరని తెలుస్తోంది' అని ప్రధాని మోడీని రాహుల్ విమర్శించారు. మన దేశంలో ప్రతి మహిళకు సమాన భాగస్వామ్యం పొందే హక్కు ఉందన్నారు. ఇలాంటి చర్యలను ఎలా అనుమతించారని ప్రియాంకా గాంధీ ప్రశ్నించారు. ఇది షాకింగ్ ఘటన అని, మహిళలను అనుమతించనప్పుడు పురుష జర్నలిస్టులు ఆ సమావేశం నుంచి బయటకు వచ్చేయాల్సిందని కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం అన్నారు.

స్పందించిన తాలిబన్ ప్రతినిధి

ముత్తాఖీ పాల్గొన్న మీడియా సమావేశంలో ఉద్దేశపూర్వకంగా మహిళలను మినహాయించలేదని తాలిబన్ అధికారి వెల్లడించారు. 'మహిళలపై ఎలాంటి వివక్షాపూరిత విధానం లేదు. పాస్‌ల సంఖ్య పరిమితంగా ఉంది. కొందరికి మాత్రమే అవి అందాయి. ఇదొక సాంకేతిక అంశం మాత్రమే. దీన్నొక విధానపరమైన సమస్యగా చూడొద్దు' అని ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు.

ఐపిఎస్ పూరణ్ మృతిపై సిట్

- పేలవంగా ఉన్న ఎఫ్ఐఆర్‌ను సరిదిద్దాలి : మృతుని భార్య అన్మీత్

చండీగఢ్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హర్యానా అదనపు డిజిపి వై పూరణ్ కుమార్ ఆత్మహత్య కేసు విచారణకు ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్)ను ఏర్పాటు చేస్తున్నట్లు చండీగఢ్ పోలీస్ చీఫ్ సాగర్ ప్రీత్ హుడా ప్రకటించారు. ఈ సిట్‌కు ఐజి పుష్పేందర్ కుమార్ నేతృత్వం వహిస్తారని తెలిపారు. తన భర్త ఆత్మహత్యకు రాష్ట్ర డిజిపి శత్రుజీత్ సింగ్ కపూర్, రోహతక్ ఎస్పి నరేంద్ర బిజార్నియాలే కారణమని ఆరోపిస్తూ పూరణ్ కుమార్ భార్య, ఐఎఎస్ అధికారి అన్మీత్ కుమార్ గురువారం ఫిర్యాదు చేయడంతో హర్యానా ప్రభుత్వం వారిపై ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నమోదు చేసిన ఎఫ్ఐఆర్ అసంపూర్తి సమాచారంతో ఉందనీ, దానిని సరిదిద్దాలని పూరణ్ కుమార్ భార్య అన్మీత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె చండీగఢ్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కన్వర్‌దీప్ కౌర్‌కు లేఖ రాశారు. పూరణ్ కుమార్ మరణించి మూడ్రోజులైనా ఆయన పార్థివ దేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించడానికి కుటుంబ సభ్యులు నిరాకరించారు.

కార్పొరేట్లకు పేదల భూములు

(మొదటిపేజి తరువాయి)

పరిహారం మాత్రం ఇవ్వడం లేదు. భూములను కోల్పోయిన రైతులకు ఉద్యోగాలు లభించకపోవడంతో వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు రోజువారి కూలీ పనులకు వెళ్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయంలో బ్రహ్మణి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పది వేల ఎకరాలు కేటాయించారు. జమ్మలమడుగు మండల పరిధిలోని పెద్దదండ్లూరు-సున్నపురాళ్లపల్లి సమీపంలో 3,344 ఎకరాలను ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కేటాయించినప్పటికీ ఎటువంటి కదలిక లేదు. మరోవైపు జిల్లాలోని వేంపల్లి, వేముల కొండాపురం, ముద్దనూరు, వీరపునాయునిపల్లి ప్రాంతాల్లోని కొండల ఎగువ భాగాలను తొలిచి రూ.2,226 కోట్లతో విండ్ ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలోని అత్యధికంగా బుడ్డశనగ, పత్తి, వేరుశనగ సాగవుతోంది. బుడ్డశనగ ఎకరాకు సగటున ఆరు నుంచి ఎనిమిది బస్తాలు దిగుబడి లభిస్తోంది. ఇటువంటి భూములను పరిశ్రమల ఏర్పాటు పేరుతో వేలాది ఎకరాలను దారాదత్తం చేయడంతో విలువైన పంటలను అన్నదాతలు కోల్పోతున్నారు.

'పవన్' మాటల 'పవర్'ఎంత?

(మొదటిపేజి తరువాయి)

విషయాలు చర్చనీయాంశంగా మారింది.

మత్స్యకారుల సమస్యలేమిటి?

ఉప్పాడ ప్రాంతంలో మత్స్యకారులు రెండు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒకటి వాతావరణ మార్పుల కారణంగా ఏడాదికేడాదికి తీవ్రమౌతున్న సముద్ర కోత కాగా, రెండవది పారిశ్రామిక సంస్థల నుండి వెలువడే కాలుష్యం. మొదటి సమస్యను కొన్ని తరాల నుండి ఇక్కడి మత్స్యకారులు ఎదుర్కొంటున్నారు. పిల్లి పిల్లలను మార్చినట్టు అలల ఉధృతినుండి కాపాడుకోవడానికి తమ నివాసాలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ, జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఉప్పాడ తీరానికి వెళ్ళేవారికి ఎవరికైనా గతంలో వారు ఎక్కడ నివసించారు?ఇప్పుడెక్కడ ఉంటున్నారు అన్న దృశ్యాలు కనిపిస్తాయి.

ఈ సమస్యను ఎదుర్కోవడానికి గత ప్రభుత్వాలు కొంత కృషి చేశాయి. తాజాగా పవన్‌కల్యాణ్ రిటైనింగ్‌వాల్ కడతామని, దానికి కేంద్రం కూడా సానుకూలంగా ఉందని చెప్పారు. రెండవది పారిశ్రామిక సంస్థలు విడుదలచేసే కాలుష్య సమస్య! దీని పరిష్కారం కోసం యు.కొత్తపల్లి మండలం కోనపాపపేట మత్స్యకారులు గతేడాది ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బీచ్ రోడ్డుని పూర్తిగా నిర్బంధించి పది రోజులపాటు నిరసన గళాన్ని వినిపించారు. ఎన్నికల కోడ్‌తో ఆందోళన విరమించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా హామీ అమలుకు నోచుకోకపోవడంతో మళ్లీ ఆందోళనకు దిగారు.కాకినాడ జిల్లా కెఎస్‌ఇజడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీలు ఇప్పటికే రెండు యూనిట్లలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వాటి వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమల్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపు లైన్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అయితే, ఫార్మా వ్యర్థాలను, విషపూరిత జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి నేరుగా ఈ పరిశ్రమలు విడిచిపెడుతున్నాయని మత్స్యకారులు చెప్తున్నారు. అరబిందో పరిశ్రమ కూడా భారీ పైపులైను ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి వదులుతోందని అంటున్నారు. ఫలితంగా మత్స్య సంపద తగ్గిపోతోందని 18 గ్రామాలకు చెందిన 18 గ్రామాలకు చెందిన దాదాపు 50 వేల మంది మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిన్నబోటుపై వేటకు వెళ్తే రోజుకు రూ.5 వేల నుంచి రూ.8 వేల విలువైన మత్స్య సంపద దొరికేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అమీనాబాద్ గ్రామానికి చెందిన మత్స్యకారులు గంటి పోలారావు, బొడ్డు జగన్నాథం 'ప్రజాశక్తి' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.


చేపల లభ్యత భారీగా తగ్గిపోయింది



గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఫార్మా కంపెనీలు, తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న హేచరీల ద్వారా రసాయనిక జలాలు, ఇతర వ్యర్థాలు సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల చేపలు దూరంగా వెళ్లిపోయాయి. కొన్ని చేపలు చనిపోతున్నాయి.

- కొవ్వూరి రాంబాబు, మత్స్యకారుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు, ఉప్పాడ

పరిహారం ఇవ్వాలి



పరిశ్రమల కాలుష్యంపై వైసిపి సర్కారు కాలం నుంచీ పోరాడుతున్నాం. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని ఆశించాం. ఒక్కొక్క మత్స్యకార కుటుంబానికీ నెలకు రూ.20 వేల పరిహారం ఇవ్వాలి. శుద్ధి చేసిన తర్వాతే వ్యర్థాలను సముద్రంలోకి వదలాలి. చదువుకున్న యువతకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలి. పైపులైన్ కోసం వేసిన సిమెంట్ దిమ్మెల వలన చిరిగిపోతున్న వలలకు నష్టపరిహారం ఇవ్వాలి.

- సూరాడ సింహాద్రి, మత్స్యకార నాయకుడు, ఉప్పాడ

జీవన సౌరభం

గెలవడానికి కారణాలు కాదు, మార్గాలను అన్వేషించాలి.

మీ కోసం

కమల, నిమ్మ తొక్కలని చిన్న చిన్న ముక్కలుగా చేసి ఎండబెట్టి పొడిచేసి సర్ఫ్‌లో కాని, సున్నిపిండిలో కాని వేస్తే చక్కటి సువాసనతోపాటు మురికి కూడా వదులుతుంది.



సహవాస దోషం



రామాపురంలో రామయ్య అనే రైతు ఉన్నాడు. అతని కొడుకు రాంబాబు ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. రాంబాబు బాగా చదువుతాడు. అన్ని పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుంటాడు. అదే తరగతిలో ఉన్న రమేష్ సెల్‌ఫోన్‌లో ఆటలకు అలవాటు పడి తరచూ పాఠశాలకు గైర్హాజరయ్యేవాడు. అలాంటి వాడితో రాంబాబు స్నేహం చేయడం మొదలుపెట్టాడు.

కొద్దిరోజులకి, రమేష్‌తో కలసి, రాంబాబు కూడా పాఠశాలకు వెళ్లకుండా సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడుకుంటూ గడపడం మొదలుపెట్టాడు. బాగా చదువుకునే రాంబాబు, రమేష్ సావాసం వల్ల చెడిపోతున్నాడని ఉపాధ్యాయులు గమనించారు.

ఒకరోజు రాంబాబు, రమేష్ పాఠశాలకు హాజరయ్యారు. బృందా టీచర్ పిల్లలందరినీ ఆటస్థలంలో కూర్చోబెట్టి 'పిల్లలూ! అయస్కాంతం దేనిని ఆకర్షిస్తుంది?' అని అడిగారు. 'ఇనుముని టీచర్" అన్నారు పిల్లలు ముక్తకంఠంతో.

'ఇది గమనించండి' అని ఇనుప ముక్కను అయస్కాంతంతో కాసేపు రుద్దారు. కాసేపటి తర్వాత ఇనుపముక్కకు అయస్కాంత శక్తి వచ్చి మరొక ఇనుపముక్కను ఆకర్షించింది. 'చూసారా.. పిల్లలూ ఇనుముకు అయస్కాంత శక్తి ఎలా వచ్చిందో అలాగే మనం ఎవరితో కలసి ఉంటామో వారి లక్షణాలు మనకు వస్తాయి. మంచి పిల్లలతో కలిస్తే మంచి బుద్ధులు వస్తాయి. చెడు అలవాట్లు ఉన్న వారితో కలిస్తే మనకూ చెడు అలవాట్లు వస్తాయి. దీనినే 'సహవాస దోషం' అంటాం' అని చెప్పారు బృందా టీచర్.

బృందా టీచర్ మాటలు రాంబాబు మనసును బలంగా తాకాయి. అప్పుడే ఒక కుక్క, తాబేలుతో స్నేహం చేసి తన నడక తీరును మరచిపోయి, తాబేలు మాదిరిగా నడిచిన వీడియో గుర్తుకు వచ్చింది. అంతే అప్పటినుంచి రమేష్‌కు దూరంగా ఉన్నాడు. స్నేహితుడు దూరం కావడంతో రమేష్ చాలా బాధపడ్డాడు. 'సెల్‌ఫోన్ చూడకుండా ప్రతిరోజూ స్కూలుకి వస్తేనే స్నేహం చేస్తాన'ని రాంబాబు కరాఖండిగా చెప్పాడు. స్నేహం కోసం రమేష్ సెల్‌ఫోన్‌ని పక్కనబెట్టాడు. రాంబాబుతో కలిసి బుద్ధిగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకున్నాడు. రాంబాబు మునుపటిలా మారడమే కాక, రమేష్‌లో కూడా మార్పు రావడం చూసి ఉపాధ్యాయులు ఎంతో సంతోషించారు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు, 94945 24445

నేను గీసిన బొమ్మ



ఎన్.ఫిలిప్,
2వ తరగతి,
ఎస్‌వి హైస్కూల్,
రామంతపూర్, హైద్రాబాద్.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కీళ్ల నొప్పులను అశ్రద్ధ చేయొద్దు

ఆర్థరైటిస్ (కీళ్ల నొప్పులు) అనేవి కీళ్లలో విపరీతమైన మంట, దృఢత్వం కారణంగా నొప్పిని కల్గించే వ్యాధి. కీళ్ల నొప్పులకు సంబంధించి చాలా రకాల వ్యాధులున్నాయి. వీటిలో ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ చాలా సాధారణ వ్యాధులు. ఏ వయస్సు వారికైనా రావొచ్చు. ఈ తరహా నొప్పులు ఎప్పుడు? ఎలా? మొదలవుతాయనేది ఆయా ఆర్థరైటిస్ రకాల బట్టి చెప్పొచ్చు. సాధారణంగా, ఆస్టియో ఆర్థరైటిస్ 50 ఏళ్లు పైబడిన వారిని ప్రభావితం చేస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ సాధారణంగా 30 నుంచి 60 ఏళ్ల వయస్సు గల పెద్దవారిలో అభివృద్ధి చెందుతుంది. శరీరంలో ప్రత్యక్ష కారణం ఉన్న ఇతర రకాలు సాధారణంగా ఆ నిర్దిష్ట ట్రిగ్గర్‌కు దగ్గరగా ప్రారంభమవుతాయి. ఉదాహరణకు పోస్ట్-ట్రామాటిక్ ఆర్థరైటిస్ ఉన్నవారిలో వారి కీళ్ళు గాయపడిన తర్వాత మాత్రమే అది అభివృద్ధి చెందుతుంది. గౌట్ కనీసం కొన్ని నెలలు అధిక యూరిక్ యాసిడ్ స్థాయిలను కలిగి ఉన్న తర్వాత మాత్రమే అభివృద్ధి చెందుతుంది.



నేడు ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం

శరీరంలో కీళ్ళు, కండరాలు, చుట్టుపక్కల కణజాలాల ఆరోగ్యాన్ని మెరుగుపర్చే వైద్య విధానమే ఫిజియోథెరపీ. ఆర్థరైటిస్ (నొప్పులు)లను తగ్గించటానికి ఉపయోగపడే మార్గం ఫిజియోథెరపీ. ఫిజియోథెరపిస్టులు కీళ్ల కదలిక, కండరాల బలం, అపసవ్యతను మెరుగుపర్చే వైద్య విధానాలను అమలు చేస్తుంటారు. ఇవి నొప్పిని తగ్గించడానికి, కీళ్లకు మరింత నష్టం జరగకుండా నిరోధించడానికి, రోగి రోజువారీ పనులు చేయగల సామర్థ్యాన్ని మెరుగుపర్చటానికి సహాయపడుతుంది. ఫిజియోథెరపీ ముఖ్య ప్రయోజనాల్లో వివిధ ఎక్సర్‌సైజులు చేయటం ద్వారా మందుల అవసవం లేకుండానే నొప్పి తగ్గిస్తుంది. మందులు ఎక్కువ కాలం ఉపయోగించినప్పుడు తరచుగా దుష్ప్రభావాలు వస్తాయి. వ్యాయామాలు, చికిత్సల ద్వారా ఆర్థరైటిస్‌ను తగ్గించటంతోపాటుగా రోగులు మరింత సౌకర్యవంతంగా కదలడానికి సహాయపడుతుంది. ఇది మెరుగైన జీవన నాణ్యతకు దారితీస్తుంది.





ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని ఏటేటా అక్టోబర్ 12న జరుపుకుంటున్నాం. ప్రపంచవ్యాప్తంగా రుమాటిక్, మస్క్యులోస్కెలెటల్ వ్యాధులు, లక్షణాలు, నివారణా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అత్యంత సాధారణ వ్యాధుల్లో ఆర్థరైటిస్ (కీళ్లనొప్పులు) ఒకటి. ప్రపంచవ్యాప్తంగా అర బిలియన్ మంది ప్రజలు ఈ వ్యాధి బారిన పడ్డారు. అమెరికాలో ఎక్కువ మంది పెద్దలు, పిల్లలు దీని ప్రభావానికి గురౌతున్నారు. అంటే ప్రతి నలుగురు పెద్దల్లో ఒకరు, కొన్ని నెలల వయస్సులోపు పిల్లలను కూడా గుర్తించొచ్చు. ఏటేటా దాదాపు 1 మిలియన్ ప్రజలు ఆసుపత్రిలో చేరుతున్నారు. పెద్దల్లో దాదాపు సగం (47 శాతం) మంది వివిధ రకాల నొప్పుల సమస్యలతో బాధపడుతున్నారు. 18 ఏళ్లు పైబడినవారిలో ఆర్థరైటిస్; ఇతర నాన్ ట్రామాటిక్ కీళ్ల రుగ్మతలు బాధపెడుతున్నాయి. ఆర్థరైటిస్ లేదా రుమాటిక్ వ్యాధి ఉన్నవారు ప్రతి సంవత్సరం అనారోగ్యం లేదా గాయం కారణంగా ఎక్కువ పనిదినాలను కోల్పోతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 210 మిలియన్ల మంది కంటే ఎక్కువ మంది ప్రజలు ఈ వ్యాధికి ప్రభావితమవుతున్నారు.

రుమాటిక్ -మస్క్యులోస్కెలెటల్ వ్యాధులు : రుమాటిక్ – మస్క్యులోస్కెలెటల్ వ్యాధులు రోజువారీ జీవితంలో తీవ్రమైన ప్రభావాలను కలిగిస్తాయి. ఆర్థరైటిస్ అనేది భారతదేశంలో విస్తృతంగా ఉన్న ఒక సమస్య. ఇది చాలా మంది ప్రజలను ప్రభావితం చేస్తుంది.

ఆర్థరైటిస్ రకాలు

100 కంటే ఎక్కువ రకాల ఆర్థరైటిస్‌లు ఉన్నాయి. వాటిలో కొన్ని సాధారణమైనవి :

ఆస్టియో : కీళ్లలోని మృదువైన కణజాలం కీణించటం వల్ల ఈ వ్యాధి వస్తుంది. కణజాలాలు విరిగిపోతాయి. ఎముకలు ఒకదానికొకటి రుద్దడం వల్ల మరింత నొప్పి, నష్టం జరుగుతుంది.

రుమటాయిడ్ : రోగనిరోధక వ్యవస్థ పొరపాటున మీ కీళ్లను దెబ్బతీసినప్పుడు వచ్చేది.

గౌట్ : కీళ్లలో పదునైన యూరిక్ యాసిడ్ స్ఫటికాలు ఏర్పడటానికి కారణమయ్యేది.

ఆంకైలోజింగ్ స్పాండిలైటిస్ : నడుము దిగువ భాగంలోని కీళ్లను ప్రభావితం చేస్తుంది.

సోరియాటిక్ : సోరియాసిస్ ఉన్నవారిని ప్రభావితం చేస్తుంది.

జువెనైల్ : 16 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు, టీనేజర్లలో వచ్చే కీళ్ల, ఇతర సమస్యలు.

సాధారణ చికిత్సలు

ఎన్ఎస్ఎఐడి లేదా ఎసిటమినోఫెన్ వంటి ఓవర్-ది-కౌంటర్ (ఒటిసి) యాంటీ ఇన్ఫ్లమేటరీ మెడిసిన్, కార్టికోస్టెరాయిడ్స్ (ప్రిస్క్రిప్షన్ యాంటీ ఇన్ఫ్లమేటరీ మెడిసిన్, కార్టిసోన్ షాట్స్‌తో సహా). రుమటాయిడ్ లేదా సోరియాటిక్ ఆర్థరైటిస్ ఉంటే వ్యాధిని సవరించే యాంటీ రుమాటిక్ మందులు (డిఎంఎఆర్‌డిఎస్). బలం చాలకుండా ఉండి నడుస్తున్నప్పుడు, కదల్లేనప్పుడు ఫిజియోథెరపీ బాగా ఉపయోగపడుతుంది. కీళ్ళు దెబ్బతిన్నా, ఎముకలు కోల్పోయినా, ఆర్థ్రోప్లాస్టీ (కీళ్ల మార్పిడి) అవసరం.

ఫిజియోథెరపీ పాత్ర

- నొప్పిని తగ్గించి, కీళ్ల కదలిక (మొబిలిటీ)ను, బలాన్ని (ఫ్లెక్సిబిలిటీ)ని మెరుగుపరుస్తుంది.
- ఇది కీళ్ల దృఢత్వాన్ని (స్టిఫ్‌నెస్) తగ్గించడానికి, వాపు (స్వెల్లింగ్)ను నియంత్రించడానికి, దైనందిన కార్యకలాపాలను సులభతరం చేయడానికి సహాయపడుతుంది.
- మానిప్యులేషన్, వేడి, చల్లని చికిత్సలు, ఎలక్ట్రోథెరపీ, ఇంట్లో చేసుకోవడానికి వ్యాయామాలు ఉంటాయి.

నొప్పి తగ్గించడం (పెయిన్ అండ్ స్టిఫ్‌నెస్ రెడ్యుక్షన్) : ఫిజియోథెరపిస్ట్ మానిప్యులేషన్ వంటి పద్ధతులను ఉపయోగించి కీళ్లలో నొప్పి, వాపును తగ్గిస్తారు. వేడి, చల్లని ప్యాక్‌ల వాడకం కూడా నొప్పిని ఉపశమనం చేస్తుంది.

కదలిక, బలం మెరుగుపర్చడం : సరైన వ్యాయామాలను సూచించడం ద్వారా కీళ్ల కదలిక పరిధిని పెంచుతారు. కండరాలను బలోపేతం చేయడానికి ప్రత్యేక వ్యాయామాలను అందిస్తారు.

ఇవీ పాటించండి

- క్రమబద్ధమైన ఆహారపు అలవాట్లు
- రోజులో సరిపడా నిద్ర
- క్రమానుగుణంగా జీవనశైలి
- పౌష్టికాహారాన్ని తీసుకోవటం
- ధూమపానం చేయొద్దు
- మద్యపానం వద్దు




- డాక్టర్ దుబ్బ నాగరాజు
ఎంపిటి ఆర్థోపెడిక్స్, పిహెచ్‌డి స్కాలర్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ఫిజియోథెరపీ విభాగం, ఎన్ఆర్ఐ జనరల్ ఆసుపత్రి, మంగళగిరి, గుంటూరు జిల్లా.
సెల్ : 97032 12170 .



కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నాం..

అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'ఎఎ 22'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. 'ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించడం రిస్కుగా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా. మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారు' అని అట్లీ తెలిపారు.

ప్రధాని మోడీని కలిసిన రామచరణ్ దంపతులు



సినీ హీరో రామ్ చరణ్, ఉపాసన దంపతులు ప్రధాని నరేంద్ర మోడీని శనివారం న్యూఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఆర్చరీ లీగ్ పోటీలు విజయవంతమైన సందర్భంగా ప్రధానిని కలిసినట్లు రామ్‌చరణ్ దంపతులు ట్విటర్ వేదికగా తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఫుట్‌బాల్ తరహాలోనే రాబోయే రోజుల్లో ఆర్చరీ లీగ్ జరుగుతందని, ఈ ఏడాది తొలిసారి ఆర్చరీ(విలువిద్య) లీగ్ పోటీలు విజయంతమైనట్లు వారు తెలిపారు. తొలి సీజన్‌లో తెలంగాణ, తమిళనాడు, ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్ టీమ్స్ పోటీపడ్డాయి. అపోలో హాస్పిటల్స్ గ్రూప్‌లో సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఉపాసనను తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ హబ్‌కు కో-చైర్మన్‌గా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

'ఆర్ సి 17' కొత్త అప్డేట్..

రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న 'ఆర్ సి17' సినిమా గురించిన కొత్త అప్డేట్ ఒకటి బయటికి వచ్చింది. ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు పూర్తి చేశారు. ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా త్వరలోనే ప్రారంభం కానున్నాయని సమాచారం. 2025 ఫిబ్రవరిలో ఈ ప్రాజెక్ట్ తొలి షెడ్యూల్ మొదలవుతుందని వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రాన్ని సంక్రాంతికి ప్రారంభించాలని చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.

7న 'ప్రేమిస్తున్నా' విడుదల



సాత్విక్ వర్మ, ప్రీతి నేహ జోడీగా నటించిన తాజా చిత్రం 'ప్రేమిస్తున్నా'. భాను దర్శకత్వం దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి వరలక్ష్మీ పప్పుల సమర్పిస్తున్నారు. కనకదుర్గారావు పప్పుల నిర్మాత. పోస్ట్ ప్రొడక్షన్స్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సినిమా నుంచి 'సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నా' వీడియోను నిర్మాతలు విడుదల చేశారు. 56 సెకెన్ల నిడివి ఉన్న ఈ విడియోలో సినిమా ఎలా ఉండబోతోందో చెప్పే ప్రయత్నం చేశారు. ఇంటెన్స్ లవ్ స్టోరీగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'ఇప్పటివరకు తెలుగులో అంత అన్ కండీషనల్ లవ్‌తో ఏ సినిమా రాలేదు. అద్భుతమైన పాటలు, పర్ఫార్మెన్సతో ఈ చిత్రం నవంబర్ 7న థియేటర్లలో విడుదల కానుంది. చాలా కాలం తర్వాత వస్తోన్న బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ఈ సినిమా. మేము విడుదల చేసిన సోల్ ఆఫ్ ప్రేమిస్తున్నాకు అన్ని తరగతుల ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది' అని దర్శకుడు వర్గాల ఆడియన్స్ నుండి సూపర్బ్ రెస్పాన్స్ లభిస్తోందని' దర్శకుడు భాను అన్నారు.

విజయ్ దేవరకొండ కొత్త సినిమా ప్రారంభం

విజయ్ దేవరకొండ తన తదుపరి సినిమాను శనివారం లాంఛనంగా ప్రారంభించారు. దిల్‌రాజు నిర్మాణంలో రవి కిరణ్ కోలా దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం మాస్ యాక్షన్, రూరల్ డ్రామా నేపథ్యంలో సాగనుంది. హైదరాబాద్‌లో జరిగిన ప్రారంభ వేడుకకు కీర్తి సురేష్ హాజరయ్యారు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా సాగుతుందని సమాచారం.





డిజిటల్ రంగంలోకి హృతిక్‌రోషన్

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ డిజిటల్ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. ప్రైమ్ వీడియోతో చేతులు కలిపి ఆయన ఓ కొత్త థ్రిల్లర్ సిరీస్‌ను నిర్మించబోతున్నారని బాలీవుడ్ వర్గాల నుంచి వార్తలు వస్తున్నాయి. 'స్టోర్మ్' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ వెబ్ సిరీస్‌కు 'టబ్బర్' ఫేమ్ డైరెక్టర్ అజిత్ పాల్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో సబా అజాద్, మలయాళ నటి పార్వతి తిరువోతు, అలయా ఎఫ్, శ్రీష్టి శ్రీవాస్తవ, రమా శర్మ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించబోతున్నట్లు తెలుస్తోంది. హెచ్‌ఆర్‌ఎక్స్ ఫిలిమ్స్ ద్వారా, ఫిల్మ్‌క్రాఫ్ట్ ఫిలిమ్స్ సహకారంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలను చిత్రబృందం త్వరలో తెలపనుంది.

శుభ్‌మన్ శతకం

- ఇండియా 518/5డిక్లేర్డ్
- వెస్టిండీస్‌తో రెండో టెస్టు



శుభ్‌మన్ గిల్ (129నాటౌట్)

న్యూఢిల్లీ: రెండోటెస్ట్‌లోనూ టీమిండియా పట్టు బిగిస్తోంది. యశస్వి జైస్వాల్ డబుల్ సెంచరీని మిస్ చేసుకోగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(129నాటౌట్) సెంచరీతో ఆదుకున్నాడు. నితీశ్‌రెడ్డి(43), ధృవ్ జురెల్(44) కూడా బ్యాటింగ్‌లో రాణించడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 5వికెట్ల నష్టానికి 518 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్‌ను రవీంద్ర జడేజా మూడు వికెట్లకు తోడు కుల్దీప్ ఒక వికెట్‌తో రాణించారు. దీంతో రెండోరోజు ఆట ముగిసేసరికి వెస్టిండీస్ జట్టు 4 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. ఆ జట్టు ఇంకా 378 పరుగులు వెనుకబడి ఉంది. తొలి ఇన్నింగ్స్‌ను శుభ్‌మన్ గిల్ సేన డిక్లేర్ చేశాక బ్యాటింగ్‌కు దిగిన పర్యాటక జట్టుకు ఓపెనర్లు శుభారంభం ఇవ్వలేకపోయారు. సిరాజ్, బుమ్రా బౌలింగ్‌లో వికెట్ కాపాడుకున్న జాన్ క్యాంప్‌బెల్ (10) స్పిన్నర్ జడేజా ఓవర్లో స్వీప్‌షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు. సుదర్శన్ చక్కగా అందుకోవడంతో అతడు నిరాశగా పెవిలియన్ చేరాడు. తగ్‌నరైన్ చందర్‌పాల్(34), అలిక్ అథనజే (41)లు కాసేపు ప్రతిఘటించి విండీస్‌ను ఆదుకునేలా కనిపించారు. కానీ, జడేజా తన మ్యాజిక్ చూపించగా చందర్‌పాల్‌ను స్లిప్‌లో రాహుల్ చేతికి చిక్కాడు. దాంతో, రెండో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యానికి తెరపడగా.. 87 పరుగులకే రెండో వికెట్ పడింది. క్రీజులో కుదురుకున్న అథనెజేను కుల్దీప్ ఔట్ చేయగా.. రోస్టన్ ఛేజ్(0)ను రిటర్న్ క్యాచ్‌తో జడేజా డగౌట్ చేర్చాడు. దీంతో 107కే నాలుగు వికెట్లు పడడంతో మరోసారి ఆలౌట్ ప్రమాదంలో పడింది విండీస్. అయితే.. షాయ్ హోప్(31నాటౌట్), టెవిన్ ఇమ్లెచ్ (14నాటౌట్) ఆచితూచి ఆడుతూ వికెట్ కాపాడుకున్నారు. దాంతో.. రెండో రోజు ఆట ముగిసే సరికి విండీస్ 4 వికెట్లు కోల్పోయి140 పరుగులు చేసింది.

రెండో రోజు తొలి సెషన్ మొదలైన కాసేపటికే యశస్వీ వికెట్ కోల్పోయింది. మూడో డబుల్ సెంచరీ కొట్టాలనుకున్న యశస్వీ.. సారథి శుభ్‌మన్ గిల్(129 నాటౌట్)తో సమన్వయం లోపంలో రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి (43) జతగా తనదైన షాట్లతో అలరించిన గిల్ జట్టు స్కోర్ బోర్డును 400 దాటించాడు. నితీశ్ వెనుదిరిగాక.. ధ్రువ్ జురెల్(44)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. గ్రీవ్స్ ఓవర్‌లో సిక్సర్‌తో దూకుడు పెంచిన గిల్.. కెరీర్లో 10వ శతకం సాధించాడు. ఆ తర్వాత మరింత రెచ్చిపోయిన గిల్ సిక్స్, ఫోర్లతో విండీస్ బౌలర్లను వణికించాడు. అయితే.. రోస్టన్ ఛేజ్ ఓవర్లో జురెల్ బౌల్డ్ కావడంతో టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

స్కోర్‌బోర్డు...

ఇండియా తొలి ఇన్నింగ్స్: 518డిక్లేర్డ్

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: క్యాంప్‌బెల్ (సి)సాయి సుదర్శన్ (బి)జడేజా 10, చంద్రపాల్ (సి)రాహుల్ (బి)జడేజా 34, అథంజే (సి)జడేజా (బి)కుల్దీప్ 41, హోప్ (బ్యాటింగ్) 31, ఛేస్ (సి అండ్ బి)జడేజా 0, టెవిన్ (బ్యాటింగ్) 14, అదనం 10. (43ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 140 పరుగులు. వికెట్ల పతనం: 1/21, 2/87, 3/106, 4/107 బౌలింగ్: బుమ్రా 6-3-18-0, సిరాజ్ 4-0-9-0, జడేజా 14-3-37-3, కుల్దీప్ 1-3-45-1, సుందర్ 7-1-23-0.

హర్మన్‌ప్రీత్ సేనకు కఠిన పరీక్ష

- నేడు ఆస్ట్రేలియా మహిళలతో ఢీ
- మ. 3.00గం॥లకు



విశాఖపట్నం: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో వరుసగా రెండు విజయాలతో దూసుకెళ్తున్న టీమిండియాకు దక్షిణాఫ్రికా బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు మూడు వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించి కళ్లెం వేసింది. టీమిండియా నిర్దేశించిన 252పరుగుల లక్ష్యాన్ని సఫారీ జట్టు 49ఓవర్లలోనే ముగించింది. టీమిండియా బౌలర్లు తొలుత రాణించి సఫారీ బ్యాటర్లను కట్టడి చేసినా.. డి-క్లార్క్(84నాటౌట్; 54బంతుల్లో 8ఫోర్లు, 5సిక్సర్లు) మ్యాచ్‌ను ముగించిన తీరు వర్ణణాతీతం. ఈ క్రమంలో ఆదివారం డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో జరిగే మ్యాచ్‌కు ఆరో బౌలర్ ఎంపికపై టీమిండియా కసరత్తు ప్రారంభించింది. ఒకవేళ టీమిండియా మహిళాజట్టు ఆరుగురు బౌలర్లతో మైదానంలోకి దిగినా ఆశ్చర్యపోన్నక్కర్లేదు. అదే జరిగితే టీమిండియా చరిత్రలో కేవలం రెండుసార్లు మాత్రమే అలా జరిగింది. రెండుసార్లు ఆసీస్‌తో మ్యాచ్ సందర్భంగా.. మరో రెండుసార్లు టీమిండియా బౌలర్లు గాయాలబారిన పడడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎంపిక జరిగింది. మరోవైపు ఆస్ట్రేలియా ఆడిన మూడు మ్యాచుల్లోనూ విజయాలను నమోదు చేసుకొని పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

ఇంగ్లండ్‌కు మరో గెలుపు

వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ మహిళల జట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. కొలంబో వేదికగా శ్రీలంకతో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు 89పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ స్కీవర్ బ్రంట్(117) సెంచరీతో రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 253పరుగులు చేసింది. అనంతరం శ్రీలంకను 45.4ఓవర్లలో 164పరుగులకే ఆలౌట్ చేసింది. ఇంగ్లండ్ బౌలర్లు ఎక్లేస్టోన్(4/17), డీన్, బ్రంట్ రెండేసి వికెట్లతో రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్కీవర్ బ్రంట్‌కు దక్కింది.

నమీబియా సంచలనం

- ఏకైక టి20లో దక్షిణాఫ్రికాపై గెలుపు

విన్హోక్(నమీబియా): టి20ల్లో నమీబియా జట్టు సంచలనం సృష్టించింది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా జట్టును ఏకైక టి20లో చిత్తుచేసింది. వాండెరర్స్ క్రికెట్ గ్రౌండ్‌లో దక్షిణాఫ్రికా జట్టు నిర్దేశించిన 135పరుగుల లక్ష్యాన్ని నమీబియా జట్టు ఇన్నింగ్స్ చివరి బంతికి ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 134 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రిటోరియస్(22), హేమన్(23), స్మిత్(31) బ్యాటింగ్‌లో రాణించగా.. కెప్టెన్ ఫెర్రిరా(4), వికెట్ కీపర్ డి-కాక్(1), హెండ్రిక్స్(7) నిరాశపరిచారు. నమీబియా బౌలర్లు ట్రంపెల్మన్‌కు మూడు, హేరింగోకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో భాగంగా నమీబియా ఓపెనర్లు స్టైన్‌క్యాంప్(13), ఫ్లైలింక్(7), ఇటన్(7) నిరాశపరిచినా.. కెప్టెన్ ఎరాస్మస్(21), కుగెర్(18)కి తోడు వికెట్ కీపర్ గ్రీన్(30), రూబెన్(11) అజేయంగా నిలిచారు. దీంతో నమీబియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 138పరుగులు చేసి విజయం సాధించింది. దక్షిణాఫ్రికా బౌలర్లు బర్గర్, సిమిలానేకు రెండేసి వికెట్లు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68